RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 19 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | గురువారం | ఏప్రిల్ | 23 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

## బెంగాల్‌లో బాబ్రీ మసీదు కట్టనీయం: అమిత్‌షా

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసా రి ఘాటు విమర్శలు చేశారు. మమతా దీదీ ఎంత బలంగా కోరుకున్నా, ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా బెంగాల్‌లో బాబ్రీ మసీదును బీజేపీ కట్టనీయదని స్పష్టం చేశారు. టీఎంసీ సిండికేట్ ముఠాలను బెంగాల్ నుంచి పారిపోయేలా చేస్తామన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగనుండగా, రెండో విడత ప్రచారంలో భాగంగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని డుమ్ డుమ్ ఉత్తర్ ఏరియాలో బుధవారంనాడు జరిగిన ర్యాలీలో అమిత్‌షా పాల్గొన్నారు. 'ఇవాళ బెంగాల్ మొత్తం సిండికేట్లమయంగా మారింది. సిమెంట్, ఇసుక, ఇటుకలు ఏమి కావాలన్నా మీరు సిండికేట్లకు డబ్బులు చెల్లించాలి. డుమ్ డుమ్ ప్రజలకు నేను ఒకటే చెప్పదలచుకున్నాను. ఈనెల 5వ తేదీ తర్వాత ఈ సిండికేట్ సభ్యులు తట్టాబుట్టా సద్దుకుని బెంగాల్ నుంచి పారిపోవడమో, వసలపోవడమో జరుగుతుంది' అని అమిత్‌షా అన్నారు.



### శివ భక్తులకు తీపికబురు..

## తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయం

ఉత్తరాఖండ్: ఆరు నెలల సుదీర్ఘ శీతాకాల విరామం తర్వాత, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు బుధవారం ఉదయం సరిగ్గా 8 గంటలకు భక్తుల దర్శనం కోసం తెరుచుకున్నాయి. అక్షయ తృతీయ శుభ ఘడియల్లో వేద మంత్రోచ్ఛారణలు, శంఖారావాల మధ్య బాబా కేదార్‌నాథ్ ఆలయ కపాటాలు తెరుచుకోవడంతో చార్‌ధామ్ యాత్రలో కీలక ఘట్టం ప్రారంభమైంది. ఈ మేరకు ఆలయాన్ని దాదాపు 51 క్వింటాళ్ల వివిధ రకాల స్వదేశీ, విదేశీ పూలతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. ఉఖీమఠ్‌లోని ఓంకారే శ్వర ఆలయం నుంచి బాబా పంచముఖి ఉత్సవ విగ్రహం మంగళవారమే కేదార్‌నాథ్ ధామ్‌కు చేరుకుంది. ఆలయ ద్వారాలు తెరుచుకున్న సమయంలో వేలాది మంది భక్తులు చేసిన 'హరహర మహాదేవ్', 'జై కేదార్' నినాదాలతో హిమాలయ పర్వత శ్రేణులు మార్మోగిపోయాయి.



### పహల్గామ్ నెత్తుటి

## జ్ఞాపకం

### ప్రధాని మోదీ భావోద్వేగ ట్వీట్

ఢిల్లీ,: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన అత్యంత హేయమైన ఉగ్రదాడికి నేటితో సరిగ్గా ఏడాది పూర్తయ్యింది. 2025 ఏప్రిల్ 22న జరిగిన ఈ దుర్ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకరమైన రోజుపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా భావోద్వేగంగా స్పందించారు. దాడిలో మరణించిన వారిని స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు దేశం మొత్తం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉగ్రవాదంపై భారత్ తన పోరాటంలో ఎప్పటికీ వెనకడుగు వేయదన్నారు. "గతేడాది ఇదే రోజున జరిగిన దారుణమైన పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకు లను స్మరించుకుంటున్నా. వారిని ఎన్నటికీ మరచిపోలేము. ఈ నష్టం నుంచి కోలుకుంటున్న మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఒక దేశంగా మనం దుఃఖంలోనూ, సంకల్పంలోనూ ఐక్యంగా నిలబ డ్డాం. భారతదేశం ఏ రూపంలోనూ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎన్నటికీ సఫలం కావు" అంటూ ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

ఏడాది క్రితం ఏం జరిగింది?: గతేడాది ఏప్రిల్ 22న దక్షిణ కాశ్మీర్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లోని బైసన్ పచ్చిక బయళ్లలో ఈ దారుణం చోటుచేసుకుంది. పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు.

### ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని స్పష్టీకరణ



### మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు

## కన్నుమూత..

విజయవాడ,: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. వయసురీత్యా నాదెండ్ల భాస్కరరావు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కాంటినెంటల్ హాస్పిటల్స్‌కు తరలించారు. కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం(ఏప్రిల్ 22)న తుదిశ్వాస విడిచారు. మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు వయసు 90 సంవత్సరాలు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రులు మరియు అభిమానులు అంతిమ నివాళులు అర్పించేందుకు వీలుగా ఆయన పార్థివ దేహాన్ని జూబ్లీహిల్స్‌లోని వారి స్వగృహంనందు ఉంచనున్నారు. నాదెండ్ల భాస్కరరావు ఆకాంక్ష మేరకు గురువారం మధ్యాహ్నం 4 గంటలకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.



### నేడు తెలంగాణ

## కేబినేట్ భేటీ

హైదరాబాద్,: నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లోఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు.

### కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం



### హర్మూజ్ జలసంధిలో..

## భారత నౌక దిగ్బంధం

ఢిల్లీ,: పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ ఉద్రిక్తతలు భారత ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. దుబాయ్ నుంచి గుజరాత్ పోర్టుకు వస్తున్న ఒక భారతీయ చమురు నౌకను ఇరాన్ విప్లవాత్మక సైనిక దళాలు హర్మూజ్ జలసంధి వద్ద దిగ్బంధించాయి. వివరాల్లోకి వెళితే.. దుబాయ్‌లోని జెబెల్ అలీ పోర్టు నుంచి ముడిచమురుతో గుజరాత్ వైపు వస్తున్న ఈ నౌకను, అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని దాటుతున్న సమయంలో ఐఆర్‌జీసీ నావికా దళాలు అడ్డుకున్నాయి. సముద్ర నిబంధనలు ఉల్లంఘించాయని ఆరోపిస్తూ, నౌకను తమ నియంత్రణలోకి తీసుకుని ఇరాన్ తీరానికి తరలించినట్లు సమాచారం.



### ఇరాన్‌తో కాల్పుల విరమణ..

## పొడిగింపు

### దిగ్బంధం కొనసాగింపు

## ట్రంప్ కీలక ప్రకటన

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అదే సమయంలో ఇరాన్ పోర్టులపై అమెరికా నౌకాదళ దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌పై దాడిని వాయిదా వేసినట్లు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. "ఇరాన్ ప్రభుత్వంలో తీవ్ర స్థాయిలో విభేదాలు ఉన్నాయి. వారు ఒక ఏకాభిప్రాయంతో ప్రతిపాదనతో ముందుకు వచ్చే వరకు సమయం ఇవ్వాలని పాక్ నేతలు కోరారు" అని ట్రంప్ పేర్కొన్నారు.

### అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి

## రూ.148 కోట్లు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ




హైదరాబాద్,ఏప్రిల్ 22 : తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మా ణానికి రూ.148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారంసచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో సబ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు.

హైదరాబాద్: హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టేను స్వాగతిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కక్షసాధింపునకు వ్యవస్థల దుర్వినియోగాన్ని తీర్పు ఎండగట్టిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టత ఇచ్చిందని గుర్తు చేశారు. "పీసీ ఘోష్ కాదు, ఇది పీసీసీ నివేదిక" అన్న బీఆర్ఎస్ వాదన నిజమైందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. సహజ న్యాయ సూత్రాలు, నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపిం చారు. కేసీఆర్ ముందే చెప్పిన అంశాలను హైకోర్టు సమర్థించిం దని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న పిల్లర్లను వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యలను త్వరగా పరిష్కరించా లని ప్రభుత్వానికి సూచించారు. గోదావరి జలాల వినియోగంపై ప్రభుత్వం వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలను ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు.. ఈ అంశంపై ఇప్పటికే మాజీ మంత్రి హరీష్‌రావు స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ ట్వీట్ చేశారు. "ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని మరోసారి నిరూపితమైంది.



## "పీసీ ఘోష్ కాదు, ఇది పీసీసీ నివేదిక"

### బీఆర్ఎస్ వాదనే నిజమైందన్న కేటీఆర్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ తీర్పుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులకు స్వల్ప ఊరట లభించినట్లయింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కమిషన్ నివేదిక రూపకల్పనలో కొన్ని నిబంధనలు పాటించలేదని కోర్టు అభిప్రాయపడింది. అయితే, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు మాత్రం చట్టబద్ధమేనని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.

కోర్టు తీర్పును తాము గౌరవిస్తామని చెబుతూనే, విచారణ తీరుపై కీలక వివరణ ఇచ్చారు.

హైకోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను కానీ, దాని విచారణను కానీ, నివేదికను కానీ తప్పుబట్టలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం విధానపరమైన నిర్ణయాన్ని మాత్రమే కోర్టు తప్పుబట్టిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిన మాట వాస్తవమని, ఈ కుంభకోణానికి బాధ్యులైన దోషులు ఎప్పటికైనా జైలుకు వెళ్లడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



## దోషులు జైలుకు వెళ్లడం ఖాయం

### హైకోర్టు తీర్పుపై మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

## అక్రెడిటేషన్ల జారీలో

# సర్కారు అట్టర్ ఫ్లాప్

### - పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటం

### - టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య..



**మహబూబ్ నగర్, మహానది న్యూస్,ఏప్రిల్ 22:** జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య విమర్శించారు. జర్నలిస్టులకు ఇవ్వాల్సిన కొత్త అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచినా కనీసం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం మహబూబ్ నగర్ లోని కెమిస్ట్ డ్రగిస్ట్ భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో మామిడి సోమయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల గతంలో ఎన్నడూ లేని వధంగా ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్యం కొనసాగుతుందని అన్నారు. గడిచిన రెండేళ్లలో జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం అనేది మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులిస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఏమయ్యిందని ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల ఊసే లేదని, చిన్న మధ్య తరహా పత్రికలకు రెఁడేళ్ళుగా అడ్వర్టైజ్మెంట్ల బిల్స్ ఇవ్వడంలేదని అన్నారు. ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టి ఐక్యంగా హక్కులను సాధించుకోవాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వాకిట అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, ఎం. యాదగిరి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మోయిజ్,పసుపుల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహ్మద్ రఫీ, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్, కోశాధికారి ఏముల నర్సింహులు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. రవి కుమార్, కో-కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్, హరిప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఖాజామైనొద్దీన్, ఎం దాసు, ఎలక్ట్రానిక్ మీడియా. విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమాకాంత్ రెడ్డి, ఎల్. నరసింహులు, ఈసి మెంబర్లు జంగం దిలీఫ్ కుమార్, రాఘువేందర్, గోపాల్ యాదవ్, మేకల శ్రీనివాస్, రవి, రామకృష్ణ,అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



# యుద్ధాలను వెంటనే నిలిపివేయాలి : మల్లేపల్లి ప్రభాకర్




అమెరికా, ఇజ్రాయిల్ చర్యల వల్ల ప్రపంచ శాంతికి భంగం కలుగుతోంది... యుద్ధాలను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు ప్రారంభించాలని సిపిఐ ఐఎంఎల్ రాంచంద్రన్ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. కామ్రేడ్ లెనిన్ 150వ జయంతి సందర్భంగా పార్టీ 57వ ఆవిర్భావ సభ హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పార్టీ అధికార ప్రతినిధి నకిరేకంటి చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై కొనసాగుతున్న ఉద్రిక్తతలు మానవాళికి ప్రమాదకరమని, ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాద ధోరణులను విడనాడి శాంతి స్థాపనకు కృషి చేయాలని సూచించారు. యుద్ధాల ప్రభావం ప్రజల జీవన స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపుతోందని, పెట్రోలు, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యాసంస్థలు, పౌర ప్రాంతాలపై దాడులు అమానుషమని పేర్కొన్నారు. ఆదివాసుల హక్కులను కాపాడాలని, సామాజిక న్యాయం సాధన కోసం పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి జయరాం, నాయకులు సంపంగి పద్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని

# రాష్ట్ర గవర్నర్ కు విజ్ఞప్తి




**హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 22:** గోమాతను జాతీయ ప్రా ణిగా ప్రకటించి సంరక్షించాలని కాచిగూడకు చెందిన లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాఫ్ శుక్లాను రాజ్ భవన్ లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లవ్ ఫర్ కౌ ఫౌండేషన్, గోవత్స ఫౌండేషన్ ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఫౌండేషన్ ప్రతినిధులు రిథేష్ జాగీర్దార్, తరుణ్ మెహతా, నరేష్ పరేఖ్, మురళీ మనోహర్ పాలోడ్, బద్రివిశాల్ లోయా తదితరులు గవర్నర్ కు వివరించారు. గోవత్స ఫౌండేషన్ ద్వారా గడిచిన 14 సంవత్సరాలలో 22 గోశాలలకు దాదాపు రూ.19 కోట్ల పశుగ్రాసాన్ని విరాళంగా అందించామని వారు తెలిపారు. అనంతరం లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ప్రతిమను గవర్నర్ కు అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు.. గోవుల సంరక్షణ కోసం చేపడుతున్న సేవలు అభినందనీయమని గవర్నర్ శివ్ ప్రతాఫ్ శుక్లా అన్నారు.

# కాకి కోసం వేట.. చివరకు కొనుగోలు..!

### - ఇదేనా కలికాలం..?

### - హైదరాబాద్‌లోని పురానాపూల్ శ్మశానవాటికలో వింత ఘటన..!



**హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 22:**
హిందూ సంప్రదాయంలో మనిషి మరణించిన తర్వాత పెట్టే 'పిండం' కాకి ముడితేనే ఆత్మకు శాంతి కలుగుతుందని, పితృదేవతలు తృప్తి చెందుతారని నమ్మకం. కానీ, మారుతున్న కాలం, పెరిగిన కాలుష్యం ఆ నమ్మకాన్ని కూడా ఒక వ్యాపారంగా మార్చే స్థితికి తెచ్చాయి.

**అసలేం జరిగింది..?**

ఇటీవల హైదరాబాద్‌లోని పురానాపూల్ శ్మశానవాటికలో ఓ కుటుంబం చనిపోయిన తమ ఆత్మీయుడికి అంత్యక్రియలు చేశారు. అనంతరం అదే శ్మశానంలో అతనికి పిండ ప్రదానం చేశారు. పిండం పెట్టి కాకి ముట్టేందుకు గంటలు గడిచాయి.. ఎండలో నిలబడి ఆకాశం వైపు కళ్లలో వత్తులు వేసుకుని చూశారు. కానీ, ఒక్క కాకి కూడా అటువైపు రాలేదు. కాకి పిండం ముట్టకపోతే ఏదో అరిష్టం జరుగుతుందని, చనిపోయిన వారి ఆత్మకు ఇంకా కోరికలు మిగిలిపోయాయని ఆందోళన చెందడం సహజం.

చివరకు విధిలేక, ఆ కుటుంబ సభ్యులు ముర్గి చౌక్ మార్కెట్‌కు వెళ్లి, ఒక కాకిని కొనుగోలు చేసి మరీ తీసుకువచ్చారు. ఆ పక్షికి పిండం తినిపించి, తృప్తిగా వెనుతిరిగారు.

**విశ్లేషణ:** ఇది భక్తా..? లేక ప్రకృతి విధించిన శిక్షా..? ఈ ఘటన మన సమాజానికి కొన్ని చేదు నిజాలను గుర్తు చేస్తోంది.

కనుమరుగవుతున్న పక్షిజాతి, పట్టణీకరణ, సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్, విపరీతమైన వేడి వల్ల కాకులు నగరాలకు దూరమవుతున్నాయి.

నమ్మకం వర్సెస్ నిస్సహాయత: కాకి పిండం ముట్టాలనేది నమ్మకం. కానీ, దాన్ని కొని తెచ్చి తినిపించడం అనేది మన నిస్సహాయతకు అద్దం పడుతోంది.


**కలికాలం పరాకాష్ట:** ఒకప్పుడు ప్రకృతిలో సహజంగా తిరిగే కాకులు, ఇప్పుడు నైవేద్యం తినడానికి కూడా "అద్దెకు" లేదా "అమ్మకానికి" దొరకడం కలికాలం కాక మరేమిటి? అంతరించి పోతున్న పక్షి జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ముఖ్యంగా ఈ వేసవి కాలంలో పక్షుల కోసం గుక్కెడు నీరు పెట్టి కాకుల్లాంటి అనేక రకాల ఫక్షులను కాపాడుకోవాలి.

# సీనాప్స్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం











**హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 22:** పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, నిరంతర సాధనతో పాటు సరైన మార్గదర్శకత్వంఎంతో అవసరం. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంలో అధ్యాపక బృందం కీలక పాత్ర పోషిస్తోంది. ఇలాంటి పోటీలు ఆత్మవిశ్వాసాన్ని పెంచి భవిష్యత్తు లక్ష్యాలకు దారి చూపుతాయని తెలంగాణ జీఎం గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ రెండవ రీజియన్ నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సీనాప్స్ పోటీ పరీక్షల విజేతలకు నగరంలోని నారాయణగూడ విద్యాసంస్థల ఆవరణలో బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి హన్సిక పటేల్, రెండవ బహుమతి హరి ఆద్యంత్ అందుకున్నారు. "విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా సమానంగా అవసరం. పిల్లల్లో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తే వారు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారు. విద్యాసంస్థలు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయి" అని ఏజీఎం బాల పరమేశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎన్‌డీ మనోహర్, కోఆర్డినేటర్ ఆజాద్, రాధిక, ప్రిన్సిపల్ విశాఖ, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ ఫ్యామిలీలో కలహాల కాపురం



కడప, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు పెను దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు అభేద్యమైన కోటలా కనిపించిన ఈ కుటుంబంలో ఆస్తి పంపకాలు, వ్యక్తిగత విభేదాలు వీధిన పడటం చర్చనీయాంశంగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ పోరు కేవలం కుటుంబ వ్యవహారంగా మిగిలిపోకుండా రాజకీయ రంగు పులుముకోవడం వల్ల అనేక పరిణామాలు చోటుచేసుకుంటు న్నాయి. రాజకీయాల్లో అత్యున్నత పదవుల్లో ఉన్న నాయకులకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో కీలకం. జగన్ తన సోదరి షర్మిల లేవనెత్తుతున్న ఆస్తి వాటాల అంశాన్ని ప్రతిపక్షాల కుట్రగా భావించ డం, చంద్రబాబు నాయుడు ట్రాప్‌లో ఆమె పడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించడం గమనార్హం. వ్యక్తిగత సమస్యలను రాజకీయ కోణంలో ఎదుర్కోవడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది. తమిళనాడులో కరుణానిధి వారసుల మధ్య జరిగిన ఘర్షణలు, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలు ఆయా పార్టీల ప్రతిష్టను భారీగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఏపీలో కూడా జగన్ తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలపై పార్టీ నేతలతో విమర్శలు చేయించడం సొంత కేడర్‌ను సైతం విస్మయానికి గురిచేస్తోంది. రక్తసంబంధీకులపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో జగన్ పట్ల ఒక రకమైన ప్రతికూల భావన ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.అమ్మ, చెల్లి ఇద్దరూ ప్రత్యర్థుల చేతిలో పావులుగా మారారనే ప్రచారం సామాన్య ఓటర్లలో ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు.

# మెట్రోతో మినీ ఎలక్ట్రిక్ బస్సుల లింక్



హైదరాబాద్, : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలోనే ప్రయాణ కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా మెట్రో స్టేషన్ల నుంచి మినీ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా.. త్వరలోనే మినీ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చాలా వరకు ఎలక్ట్రిక్ బస్సులే నడుస్తుండగా.. వాటిని ఛార్జ్ చేసేందుకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఆర్టీసీ రెడీ అయింది. హైదరాబాద్ మెట్రో ప్రతి నిత్యం దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతోంది. నగరం ఓ మూల నుంచి మరో మూలకు చేరుకోవాలంటే చాలా మంది మెట్రో ట్రైన్లను ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ మెట్రో సేవలు నగర వ్యాప్తంగా లేకపోవటంతో చాలా మంది మెట్రో దిగిన తర్వాత తమ తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తుంటారు. అయితే చాలా వరకు మెట్రో స్టేషన్ల సమీపంలో బస్టాండ్లు అందుబాటులో ఉండటం లేదు. చాలా దూరం నడిచి వెళ్లాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మెట్రో ప్రయాణికులకు తీపి కబురు చెప్పింది. మెట్రోరైలు దిగి ప్రయాణికులు తిరిగి తమ చివరి గమ్యం చేరేందుకు ఫీడర్ సర్వీసులుగా మినీ ఎలక్ట్రిక్ బస్సులను ఉపయోగించాలని ఆర్టీసీ నిర్ణయించింది.

మెట్రో స్టేషన్ సమీపం నుంచి ఈ మినీ ఎలక్ట్రిక్ బస్సులను సమీప కాలనీలకు నడపనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే ఈ ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సులనే నడిపేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఇంటర్మిటెంట్ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఆర్టీసీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ప్రధాన టెర్మినల్ పాయింట్లు అయిన పటాన్‌చెరు, ఆరాంఘర్, ఎల్బీనగర్, ఉప్పల్, వనస్థలిపురం, గచ్చిబౌలి, కేపీహెచ్‌బీ కాలనీ, చిలకలగూడ, బాలానగర్, మెహిదీపట్నం, గండిమైసమ్మ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ఈ ఛార్జింగ్‌స్టేషన్లు అవసరమని తాజాగా ఆర్టీసీ అదికారులు గుర్తించారు. ఇందుకు 1500 నుంచి 2500 చదరపు మీటర్ల చొప్పున భూమి కావాలని ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపింది.

# సంపాదకీయం

## చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా ?

అంబేద్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేద్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాత్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయర య్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఏ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రిక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్పూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్పూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

# అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

## – అగ్నిమాపక కేంద్రం కోసం మహానది గత కొంతకాలంగా నిరంతర వార్తల పోరాటం – పాలకులు దృష్టి సారించాలి




**బయ్యారం, మహానది న్యూస్,ఏప్రిల్ 22:** వేసవి అంటే ఎండలతో పాటు అగ్ని ప్రమాదాలు కూడా భయపెడుతుంటాయి. ఏటా అగ్ని ప్రమాదాల్లో లక్షలాది రూపాయల ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 వేల జనాభాకు ఒక ఫైర్ ఇంజన్ ఉండాలి. ఈ ప్రకారం చూస్తే ఒక్కో మండలానికి కనీసం ఒక అగ్నిమాపక యంత్రం ఉండాలి. అయితే ఈ ప్రకారం బయ్యారం మండలంలో ఆ పరిస్థితి లేదు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ఒకే ఒక్క అగ్నిమాపక కేంద్రం నుండి బయ్యారం మండల కేంద్రానికి చేరుకోవాలంటే పది కిలోమీటర్లు అక్కడ నుండి ఏజెన్సీ ప్రాంత పరిధి సుమారు 45 నుండి 50 కిలోమీటర్లు దూరంలో మారుమూల పల్లెలు ఉన్నాయి. ఒకవేళ అగ్గిరేగిన సమాచారం అందుకుని అక్కడికి వెళ్లే సరికి ఆస్తులు బూడిదగా మారిపోయే పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాలలో ప్రాణాలు కూడా కోల్పోవొచ్చు. వేసవి అంటే మండే కాలం, అధిక ఉష్ణోగ్రతలు పెరిగి అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉన్న కాలం. అయితే ఎక్కడైనా అగ్గి రేగితే ఆస్తులు బూడిదకావాల్సిందే. జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు, శకటాలు గ్రామాలు, మండలాలకు అనుగుణంగా లేవు. దీంతో అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్ కదిలే వరకు కష్టమే. ఒకవేళ కదిలినా డ్రైవర్ను వెతుక్కోవాలి.. ఫైర్ మ్యాన్లను పిలుచుకోవాలి.. నీటి వనరుల కోసం గాలించాలి.. ఇదంతా జరిగే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. అగ్ని ప్రమాదాలను నివారిం చలేని విధంగా జిల్లాలో అగ్నిమాపకశాఖ పరిస్థితి ఉంది. పలు అగ్నిమాపక కేంద్రాల పరిధిలో వందల గ్రామాలున్నాయి. ప్రమాదాల సమయంలో. అగ్నిమాపక యంత్రం అక్కడకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి..డొక్కు వాహనాలతో అగ్ని ప్రమాదాలను నివారించలేని విధంగా జిల్లాలో అగ్నిమాపకశాఖ పరిస్థితి ఉంది.జిల్లా అగ్నిమాపక కేంద్రం పరిధిలో వందల గ్రామాలున్నాయి. ప్రమాదాల సమయంలో అగ్నిమాపక యంత్రం అక్కడకు వెళ్లే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఒక్కోసారి రెండు ప్రమాదాలు ఏక కాలంలో వేరువేరు చోట్ల జరిగితే ఒకదాని గురించి ఆశలు వదులుకోవాల్సిందే. సకాలంలో ప్రమాదాలు నివారించలేక పోవడంతో పలు సందర్భాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలు భారీగా ఉంటున్నాయి. మండలంలో ఏ మూల ఏ ప్రమాదం జరిగినా ఆప్రాంతానికి దగ్గరలో ఉన్న ఫైర్ ఇంజన్ వెళ్లడానికే చాలా సమయం పడుతోంది. తగినన్ని ఫైర్ స్టేషన్లు, వాహనాలు లేక, సిబ్బంది లేక ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాల్సిన అగ్నిమాపక శాఖపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రాధాన్యం కలిగిన అగ్ని మాపక శాఖపై పాలకులు అలసత్వాన్ని ప్రదరిస్తుండటపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు. బయ్యారం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేసి ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి అగ్నిమాపక కేంద్ర ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.. అడవి తల్లి కడుపులో అగ్గి రాజుకుంటోంది. అడవి చల్లగా ఉంటే ఊరు పచ్చగా ఉంటాయి. వానలు కురుస్తాయి. ప్రకృతి సమతుల్యత ఉంటుంది. కానీ ఏదో ఒక కారణలతో వేసవి మొదలైందంటే రోజూ బయ్యారం పరిసరాలలోని అడవి అంటుకుంటోంది. ఆకతాయిల దుశ్చర్యనో లేక పొగత్రాగేవారి ఏమరపాటో..కారణం ఏదైనా అటవీ అధికారులు బాధ్యులను గుర్తించి కఠినచర్య లు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడమే దీనికి కారణమనే విమర్శలూ ఉన్నాయి. బలమైన గాలులకు రాపిడి జరిగి నిప్పురగిలి అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.కారణం ఏదైనా అడవులు మాత్రం కాలిబూడిద అవుతున్నాయి.. అడవిలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. వివిధ రకాల వృక్ష, తీగ, గడ్డి జాతుల మొక్కలు, చెట్ల విత్తనాలు తిరిగి మొలకెత్తే సహజ ప్రక్రియ ఆగిపోతుంది. అడవులు అగ్నికి ఆహుతి కావడం వల్ల ప్రకృతి సిద్ధమైన ఎరువు తయారుకాక అడవి పలుచబడుతుంది. శాఖహార జంతువు లకు ఆహార కొరత ఏర్పడుతుంది. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలి.

### వన్యప్రాణులకు పొంచివున్న ప్రమాదం

వన్యప్రాణులకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ఈ క్రమంలో మంటలు అలుముకుంటే ఒక్కసారిగా అడవంతా దగ్ధమయ్యేందుకు అవకాశం వుంటుంది. అడవిలో ఆవాసం వుండే వన్యప్రాణులకు అగ్నికీలలు, పొగతో ప్రమాదం పొంచివుంటుంది. అంతేకాకుండా వన్యప్రాణులు అడవులను వదిలి గ్రామాల వైపునకు మళ్లేందుకు అస్కారం ఏర్పడుతోంది. వీటితో పాటు అడవుల్లో భూమిని మేలు వేసే క్రిమికీటకాలు సైతం నాశనమై అడవుల అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతోంది.బయ్యారం మండలం బాలాజిపేట, ఇరుసులాపురం, రామచంద్రాపురం, మొట్ల తిమ్మాపురం తదితర గ్రామాలను అనుకొని అడవులు విస్తరించి ఉన్నందున అడవులలోని అగ్ని కీలలు గ్రామాల్లో, తండాలో విస్తరించే పెను ప్రమాదం ఉంది.


ప్రమాద సమయంలో అలస్యంగా ఫైర్ ఇంజన్లు చేరుకుంటే మండలంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న తరుణంలో మండలంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడం తీవ్ర నష్టానికి తావిస్తుంది. అగ్ని ప్రమాదం జరిగితే ఇల్లందు నుండి గాని, మహబూబాబాద్ నుండి గాని దాదాపు 30 నుండి 40 కిలోమీటర్లు ప్రయాణ సమయానికే క్లిష్ట సమయం వృధా అవుతున్న పరిస్థితి, కాబట్టి ప్రజా ప్రతినిధులు, అధికారులు మండల కేంద్రంలో కనీసం ఒక అగ్నిమాపక యంత్రాన్ని ఉంచాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# కనిపించకుండానే నిర్మానుష్యం



హైదరాబాద్: భానుడి ప్రతాపంతో పగటి వేళ వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే పగటి వేళ రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం నెలకొని ఉంది. గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవ్వడమే కాకుండా సెగగాలుల తీవ్రతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి ఎండల తీవ్రత మొదలవుతుంది. సాయంత్రం ఐదు గంటల వరకూ ఎండల తీవ్రత తగ్గడం లేదు.ఆంధ్రప్రదేశ్ లో ఎండల తీవ్రతతో పాటు వడగాల్పులు కూడా వీస్తుండటంతో బయటకు రావాలంటేనే భయమేస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాదాపు అన్ని చోట్ల నలభై రెండు నుంచి నలభై నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పల్నాడు, గుంటూరు, కృష్ణా, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. దాదాపు రాష్ట్రంలోని సగం మండలాల్లో వడగాలులు వీస్తున్నాయని, ఉత్తర కోస్తా ప్రాంతంలో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారుతెలంగాణలో నేడు, రేపు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.రోజు కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరికొన్ని జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. 262 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందన్నారు. తెలంగాణలో క్రమంగా ఎండలు పెరుగుతున్నాయి. పలు జిల్లాల్లో ఎండల ధాటికి ఇళ్లకే ప్రజలు పరిమితం అవుతున్నారు. ఆదిలాబాద్‌లో 43.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 42.6 డిగ్రీలు, మిగిలిన అన్ని జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్రంలో ఎండలు, వడగాలులు మరింత ప్రభావం చూపనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రేపు కోస్తా, రాయలసీమలో 42-44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. 46 మండలాల్లో తీవ్ర వడగాలులు, 73 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఎండ తీవ్రత, ఉక్కపోతపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్న అధికారులు సూచిస్తున్నారు.

# పక్కా వ్యూహాలతో తమ్ముళ్లు..



విజయవాడ, : తెలుగుదేశం పార్టీ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు అటాక్ అనేది ఆ పార్టీ స్ట్రాటజీ కాదు. రాజకీయ విమర్శలు వస్తే దానికి ధీటైన కౌంటర్ ఇవ్వడమే ఆ పార్టీ నేతలు చేసే పని. కానీ ఇటీవల పరిణామాలు చూస్తుంటే మాత్రం ముందే టిడిపి మంత్రులు అటాక్ చేయడం చూస్తుంటే మాత్రం ప్రత్యేక వ్యూహం ఉన్నట్టు అర్థమవుతుంది. జగన్ మావిగన్ రాజధాని ప్రతిపాదన తర్వాత రకరకాలుగా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సరిగ్గా అదే సమయంలో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సెగలు పుట్టించాయి. అయితే ఆయన ఒక్కడే కాదు. ఆ తరువాత మంత్రి పయ్యావుల కేశవ్. అటు తరువాత మంత్రి వంగలపూడి అనిత, చివరకు నిమ్మల రామానాయుడు.. ఇలా అంతా వరుసగా మీడియా ముందుకు వచ్చి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా టిడిపి మంత్రులు ఈ తరహా అటాక్ చేయడం వైసీపీకి నిద్ర పట్టడం లేదు.సాధారణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువగా కౌంటర్ అటాక్ ఉంటుంది. దీనిపైనైనా మూకుమ్మడి దాడి ఆ పార్టీ పుణ్యమే.



# పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి

**బుగ్గారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**

**నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనుల పరిశీలన**

జగిత్యాల: పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా బుగ్గారం మండలం యశ్వంత్రావుపేట్ గ్రామాన్ని సందర్శించి నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బుగ్గారం మండలంలోని యశ్వంత్రావు పేట గ్రామంలోని ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిం చారు.అంగన్వాడీ భవనాల నిర్మాణ స్థితిని పరిశీలించి తగు సూచనలు అందిం చారు.పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అనంతరం బుగ్గారం మండల కేంద్రంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, సమయపాలన పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, మహిళా సంఘ భవన నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులను నిర్లక్ష్యం చేయకుండా అధికారు లు నిరంతరం పర్యవేక్షణ చేయాల ని సూచించారు. అధికారులు నిర్మా ణంలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించడం తప్పనిసరి అని అన్నారు.ప్రజా అవసరా లకు అనుగుణంగా నిర్మాణంలో ఉన్న అభివృ ద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్దేశిత గడువుల్లోనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# వాకింగ్‌లో ఎన్ని రకాలు ఉంటాయో తెలుసా..?



**మనకు అందుబాటులో ఉన్న అత్యంత సురక్షితమైన, అసలు ఖర్చు లేని వ్యాయామాల్లో వాకింగ్ ఒకటి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎవరైనా సరే వాకింగ్ చేయవచ్చు. రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్ చేయడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి. అయితే వాస్తవానికి వాకింగ్‌లోనూ చాలా రకాలు ఉంటాయి. ఒక్కో రకమైన వాకింగ్ చేయడం వల్ల శరీరంలోని భిన్న అవయవాలకు భిన్నమైన ఫలితాలు కలుగుతాయి. అయితే ఎవరైనా సరే తమకు ఏ రకమైన వాకింగ్ సెట్ అవుతుందో దాన్ని చేయాల్సి ఉంటుంది. దీంతో ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చు. ఇక వాకింగ్ లో ఎన్ని రకాలు ఉంటాయో, ఏ తరహా వాకింగ్‌తో ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.**


**బ్రిస్క్ వాకింగ్..:** వేగవంతమైన నడకను బ్రిస్క్ వాకింగ్ అంటారు. ఈ వాకింగ్‌లో చేతులను గట్టిగా ఊపుతూ గంటకు కనీసం 3 నుంచి 4 మైళ్ల వేగంతో వాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీన్నే బ్రిస్క్ వాకింగ్‌గా చెబుతారు. ఈ తరహా వాకింగ్‌ను రోజూ 30 నిమిషాల పాటు చేస్తే బీపీ తగ్గుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. హృదయ సంబంధిత వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అయితే ఈ వాకింగ్‌ను రోజూ చేయాల్సిన పనిలేదు. వారంలో కనీసం 5 సార్లు చేసినా చాలు, దీంతో ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. కొలెస్ట్రాల్, అధిక బరువు ఎక్కువగా ఉన్నవారు, షుగర్ ఉన్నవారు ఈ వ్యాయామం చేస్తే మంచిది.

**పవర్ వాకింగ్..:** ఇక బ్రిస్క్ వాకింగ్‌నే ఇంకాస్త వేగంగా చేయాల్సి ఉంటుంది. అంటే గంటకు 5 మైళ్ల వేగంతో వాకింగ్ చేయాలన్నమాట. అలాగే చేతులను కూడా ఇంకాస్త వేగంగా ఊపాల్సి ఉంటుంది. దీన్నే పవర్ వాకింగ్ అంటారు. పవర్ వాకింగ్ వల్ల శరీరంలో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి పవర్ వాకింగ్ ఎంతగానో మేలు చేస్తుంది. త్వరగా బరువు తగ్గవచ్చు. శరీరంలోని కొవ్వు త్వరగా కరిగిపోతుంది. ఈ వ్యాయామాన్ని కూడా వారంలో 5 రోజుల పాటు చేస్తే సరిపోతుంది. 2 రోజులు విశ్రాంతి తీసుకోవచ్చు.

**ట్రెయిల్ వాకింగ్..:** ప్రకృతి కాసేపు వాకింగ్ చేస్తూ కాసేపు రెస్ట్ తీసుకోవడాన్ని ట్రెయిల్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీరానికి ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. ఊపిరితిత్తులు ఆరోగ్యంగా మారుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఈ తరహా వాకింగ్‌ను రోజూ చేయవచ్చు. ఇక చిన్నపాటి పొడవైన స్టిక్స్ సహాయంతో నడవడాన్ని నోర్డిక్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీరంలోని పైభాగానికి కూడా సపోర్ట్ లభిస్తుంది. కండరాలు దృఢంగా మారుతాయి. వయస్సు మీద పడినవారు, బ్యాలెన్స్ సరిగ్గా లేనివారు లేదా సర్జరీలు అయిన వారు స్టిక్స్ సహాయంతో ఈ వాకింగ్ చేయవచ్చు. దీంతో త్వరగా కోలుకుంటారు.

**బ్యాక్ వార్డ్స్ వాకింగ్..:** సాధారణ వాకింగ్‌కు బదులుగా వెనక్కి కూడా నడవవచ్చు. దీన్నే బ్యాక్‌వార్డ్స్ వాకింగ్ అంటారు. దీని వల్ల శరీర భంగిమ సరిగ్గా ఉంటుంది. బ్యాలెన్స్ అదుపులోకి వస్తుంది. వెన్నెముక కండరాలు దృఢంగా మారి వెన్నుకు సపోర్ట్ లభిస్తుంది. వెన్ను నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే చెప్పుల్లేకుండా కూడా నడవవచ్చు. ఇలా ప్రకృతిలో పచ్చగడ్డి మీద నడవాల్సి ఉంటుంది. దీంతో అరికాళ్లలో ఉండే పలు నాడులకు భూమి ఆకర్షణ శక్తి లభిస్తుంది. దీంతో శరీరంలోని పలు నాడులు యాక్టివేట్ అవుతాయి. దీంతో పలు రకాల వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ఇలా పలు రకాల వాకింగ్‌లలో మీకు కావల్సిన వాకింగ్‌ను చేసి దాంతో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# కోపాన్ని అదుపులో పెట్టుకోవాలి !



కోపాన్ని మనసు నుంచి తొలగించుకొనేందుకు మనిషికి నిరంతర సాధన చేయాలి. అలా చేస్తే శరీరం అదుపులోకి వస్తుంది. కోపం జయిస్తే ఇంద్రియాలను జయించవచ్చు. వసిష్ఠుడి మీద కోపంతో విశ్వామిత్రుడు ఘోర తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షం కాగా ధనుర్వేద రహస్యాలను బోధించమని కోరతాడు. శివుడు అంగీకరించి అన్ని అస్త్ర విద్యలను సిద్ధింప జేస్తాడు. ఆ అస్త్రాలను వసిష్ఠుడిపై ప్రయోగించగా ఆయన తన తపశ్శక్తితో వాటిని నిలువరిస్తాడు. క్షత్రియుడిగా ఉండి బ్రహ్మర్షిని జయించడం కష్టమని విశ్వామిత్రుడు తెలుసుకుంటాడు. బ్రహ్మర్షిగా మారడానికి దీర్ఘకాలం తపోదీక్ష వహిస్తాడు. బ్రహ్మ ప్రత్యక్షమై బ్రహ్మర్షిత్వాన్ని పొందావని చెప్పినా అతడిలో పూర్తిగా సంతోషం కలగదు. వసిష్ఠుడితో 'బ్రహ్మర్షీ!' అని పిలిపించుకోవాలని ఉందన్న కోరికను తెలియజేస్తాడు. వసిష్ఠుడు అలాగేనని పలుకుతాడు. అయితే ఆయన పూర్తిగా క్రోధాన్ని విడిచిపెట్టాడో లేదో తెలుసుకోవాలనే ఉద్దేశంతో విశ్వామిత్రుడు తనవద్దకు వస్తేనే బ్రహ్మర్షి అని పిలుస్తానని చెబుతాడు. విశ్వామిత్రుడు వసిష్ఠుడి వద్దకు వెళ్లగా ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించి దూరంగా పొమ్మంటాడు. ఆయన వెళ్లబోతుండగా మరలా రమ్మంటాడు. ఇలా పదేపదే చేసినా విశ్వామిత్రుడి ముఖంలో ప్రశాంతత చెదరకపోయేసరికి నిజంగానే బ్రహ్మర్షివయ్యావంటూ అభినందిస్తాడు. పతన హేతువైన క్రోధాన్ని గెలిచి చూడు, నువ్వే విశ్వామిత్రుడివవుతావు. అందుకే మనలో ఉన్న క్రోధాన్ని జయిస్తే..ప్రపంచాన్ని జయించడమే కాదు..భగవంతుడినీ జయించవచ్చు.

# పెంకితనం పోగొట్టాలంటే..




పిల్లలు ఒక్కోసారి చాలా మొండిగా వ్యవహరిస్తుంటారు. తాము అనుకున్నట్లే జరగాలని పట్టుబడతారు. తమకు నచ్చినట్లు జరగకపోతే తల్లిదండ్రులనే కాదు.. ఎవరినైనా లెక్కచేయరు. ఒక్కోసారి అనకూడని మాటలు కూడా అనేస్తుంటారు. ఇంకాస్త రెచ్చిపోయి అక్కడ ఏ వస్తువుంటే అది.. ఒకవేళ చేతిలో ఉన్నదైనా.. అది ఎంత విలువైనదైనా.. ఏమాత్రం ఆలోచించకుండా విసిరి కొడతారు. ఇంకొందరు తల్లిదండ్రులపై దాడి చేస్తారు. ఇలాంటి పిల్లల ప్రవర్తనతో ఒక్కోసారి తల్లిదండ్రులూ ఓర్పు వహించలేక రెండు తగిలిస్తారు. అయితే ఇలా చేస్తే వారిలో మార్పు రాకపోగా, వారి ప్రవర్తన మరింత దిగజారుతుందనేది నిపుణుల హెచ్చరిక. వారి వైఖరిలో మార్పు తేవడానికి ఏవిధంగా వ్యవహరించాలో నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. పిల్లలు జాలి, దయ, కరుణ, ఎదుటివారి పట్ల సానుభూతి, తోటివారి పట్ల సహానుభూతితో వ్యవహరించకపోతే.. వాటి గురించి చెప్పి, నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. వీటన్నింటికన్నా ముందు స్నేహంగా, ప్రేమగా మెలగడం, ఆప్యాయంగా పలకరించడం, అనురాగం కలిగి ఉండడం ఎంత అవసరమో వివరించాలి. అసలు చెప్పకుండా ఇవన్నీ వారి నుంచి ఆశించడం అత్యాశే అవుతుంది.

**కారణాలు గుర్తించాలి..:** పిల్లలు ఇలా పెంకిగా వ్యవహరించడానికి అసలు కారణాలు ఏమిటో తెలుసుకోవాలి. ఒక్కోసారి పిల్లలు వారిలోని బాధల్ని సరిగా వ్యక్తపరచలేకపోవడమే ప్రధానకారణం అంటున్నారు నిపుణులు. వారికి కలిగే బాధ, కష్టం తల్లిదండ్రులకు వ్యక్తపరచలేనప్పుడే పిల్లలు ఇలా మొండిగా వ్యవహరిస్తారని అంటున్నారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రుల బాధ్యత మరింత ఎక్కువగా ఉంటుంది. పిల్లల బాధ ఏమిటో తల్లిదండ్రులే తరచి చూడాలి. ఇంకా చెప్పాలంటే తల్లిదండ్రులు కారణం ఏమిటో పరిశోధించాలి. అప్పుడే వాళ్లు ఏం చెప్పదలచుకున్నారో అర్థంచేసుకోవడానికి తల్లిదండ్రులే ప్రయత్నించాలని చెప్తున్నారు నిపుణులు.

**సభ్యమైన పదజాలం వాడేలా..:** పిల్లలు ఏదైనా కొత్త పదం వినగానే పదే పదే అదే రిపీట్ చేస్తుంటారు. అందుకే పిల్లల ముందు పెద్దలు జాగ్రత్తగా ఉండాలి. అదే సందర్భంలో పిల్లలు తోబుట్టువులతో, తల్లిదండ్రులతో, బయటివారితో, పెద్దలతో, తోటి స్నేహితులతో, బంధువులతో ఎవరితో ఎలా మాట్లాడాలో చెప్పాలి. ఎలాంటి పదజాలం ఉపయోగించాలి అనేది నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటున్నారు నిపుణులు. మాట్లాడే విధానంతోనే తన పట్ల ఎలాంటి గౌరవం ఏర్పడుతుందో, తనకు నెరవేరాల్సినవి ఎలా వనగూడతాయో తెలియజెప్పాలి. ఇవన్నీ వారి భావోద్వేగాలనుమెరుగైనపద్ధతిలో వ్యక్తిక రించడానికి తోడ్పడుతుంది. అంతేకాదు తమని తాము తీర్చిదిద్దు కోవడానికి, ప్రవర్తనపరమైన లోపాలు సరిజేసేందుకు ఉపయోగపడు తుంది. జాలి, దయ వంటి సుగుణాలు కూడా అలవడు తాయని చెప్తున్నారు నిపుణులు. కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా పిల్లల్లో మెరుగుప డతాయి. దీనివల్ల వారి భవిష్యత్తుకు మెరుగైన మార్గం ఏర్పడినట్లే. మంచి పదాలను నేర్పించడం వల్ల, వాళ్లు వాటిని ప్రాక్టీస్ చేయడం వల్ల వారి పట్ల వారికే నమ్మకం కలుగుతుందని అంటున్నారు.

**ప్రశంసించాలి..:** పిల్లలు తమ ప్రవర్తనను మార్చుకుంటున్నప్పుడు చిన్న అభినందన కొండంత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. ఇలా చేయడం వల్ల వారిని మరింత బలంగా మార్పు వైపు ప్రోత్సహించినట్లే అంటున్నారు నిపుణులు. పిల్లలకు ప్రశంస అనేది బూస్టు లాంటిది. పిల్లలు తల్లిదండ్రులు ప్రోత్సహించాలనే ఎక్కువగా కోరుకుంటారు. అందుకే ఎలాంటి పనులు చేస్తే మీ నుంచి అభినందనలు వస్తాయో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. దానివల్ల వారు అలాగే నడుచుకుంటూ తల్లిదండ్రుల నుంచి బోలెడు అభినందనలు పొందుతారు. పిల్లల్ని ప్రోత్సహించి, మంచి ప్రవర్తన కలవారిగా తయారుచేయండి అంటున్నారు నిపుణులు. దీనివల్ల పిల్లల్లో మొండితనం అనేదే కనపడదని చెప్తున్నారు.

# వట్టి వేరు.. ఉపయోగాలు వేర్వేరు..





సాధారణంగా ఎండాకాలంలో ఇల్లు చల్లదనం కోసం వట్టి వేళ్లతో చేసిన చాపలు వాడుతుంటారు. కొబ్బరి నూనెలో వేసుకుని కూడా కొంతమంది ఉపయోగిస్తుంటారు. వీటిని ఆహారంలో కూడా భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ వేర్లలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా ఔషధాల్లో వాడతారని వైద్యులు చెబుతున్నారు. వట్టివేరుతో షర్బత్ తయారుచేసుకుని తాగడం వల్ల ఎండాకాలం తరచూ వచ్చే కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి తగ్గుతాయి. నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మెదడుకి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.వట్టివేరు సారం శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. సువాసన భరితంగా ఉండడం వల్ల ఒత్తిడి కూడా దూరమవుతుంది.నిద్రలేమిని పోగొట్టి జీర్ణ సమస్యలని దూరం చేస్తుంది..తలనొప్పితో బాధపడుతుంటే ఈ వేర్లని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగొచ్చు. వేర్లని మెత్తని పేస్టులా నూరి దానిని తలపై పట్టిలా వేసుకుని కాసేపయ్యాక శుభ్రం చేసుకున్నా తలనొప్పి తగ్గిపోతుంది. వేర్లని ఓ గ్లాసులో వేసి ఓ నాలుగైదు గంటలు లేదా రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ సమస్య దూరమవుతుంది. కుండనీళ్లు వాడేవారు ఈ వట్టివేరుని ఓ తెల్లని వస్త్రంలో మూట కట్టి ఆ నీటిలో వేయాలి. రెండు, మూడ్రోజులకి ఓసారి వట్టివేరును మార్చుకోవాలి. కుండ నీటిలో నానబెట్టిన వట్టివేర్లని పారేయకుండా దానిని మెత్తగా నూరుకొని ప్యాక్‌లా ముఖానికి వేసుకోవచ్చు. దీంతో ముఖంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవుతాయి. వట్టివేర్లని నీటిలో వేసి మరిగించి స్నానానికి వాడే నీటిలో కలిపి స్నానం చేస్తే చెమట వాసన దూరమవుతుంది.

# చెమటకాయలు పోవాలంటే..



ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్యల్లో చెమటకాయలు ఒకటి. వీటి కారణంగా చర్మం దురద పెట్టటమే కాకుండా మృదుత్వాన్నికోల్పోతుంది. కొన్ని సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే చాలా సులభంగా చెమటకాయల నుంచి బయట పడొచ్చు.

పెరుగు : చెమట కాయలు ఉన్న ప్రదేశంలో చల్లని పెరుగుని అప్లై చేసి 15 నిమిషాలు ఉంచాలి. తరువాత చల్లని నీటితో కడిగేసి మెత్తటి బట్టతో అద్దాలి.పెరుగులో సహజంగాఉండేయాంటీ బ్యాక్టీరియల్,యాంటీ ఫంగల్ ప్రాపర్టీస్ చెమటకాయలు రాకుండా చేస్తాయి.

రోజ్ వాటర్ : 200 ఎంఎల్ రోజ్ వాటర్‌లో నాలుగు టేబుల్ స్పూన్ల తేనె, 200 ఎంఎల్ ప్యూర్ వాటర్ కలపాలి. బాగా కలిపి ఐస్ ట్రేలో పోసి ఫ్రీజ్ చేయాలి. ఇవి క్యూబ్స్‌లా అయ్యాక నాలుగైదు క్యూబ్స్ తీసుకుని పల్చని మస్లిన్ బట్టలో చుట్టి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో మృదువుగా అద్దాలి. రోజ్ వాటర్ చర్మం పీహెచ్ బ్యాలెన్స్‌ని మెయింటెయిన్ చేస్తుంది. ఎక్కువగా ప్రొడ్యూస్ అయ్యే ఆయిల్‌ని కంట్రోల్ చేస్తుంది.

గంధం : గంధానికి చల్లని ఫుల్ ఫ్యాట్ మిల్క్ కలిపి ఆ మిశ్రమాన్ని చెమట కాయలు ఉన్న ప్రదేశంలో పట్టించి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

ముల్తానీ మిట్టి : మూడు టేబుల్ స్పూన్ల ముల్తానీ మిట్టిలో రెండు టీ స్పూన్ల పుదీనా పేస్ట్ కలిపి తగినన్ని చల్లని పాలు పోసి స్మూత్ పేస్ట్ తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని చర్మం మీద అప్లై చేసి గాలికి ఆరనివ్వాలి. ఆ తరువాత చల్లని నీటితో కడిగేయాలి.

కలబంద : చెమటకాయలు ఉన్న ప్రదేశంలో కొంచెం కలబంద గుజ్జు రాస్తే త్వరగా తగ్గిపోతాయి. కలబందలో ఆస్ట్రిజెంట్ లక్షణాలు ఉండటం వలన చెమటకాయలు త్వరగా తగ్గటానికి సహాయపడతాయి. చర్మంపై ఉండే ఇన్‌ఫెక్షన్లను కూడా తగ్గిస్తుంది.

టీ ట్రీ ఆయిల్ : టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు సమృద్ధిగా ఉంటాయి .కొంచెం టీ ట్రీ ఆయిల్‌ను తీసుకుని దానికి కొంచెం నీటిని కలిపి మిశ్రమంగా తయారు చేయాలి. ఆ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి చర్మంపై రాస్తే చెమట కాయలు చాలా త్వరగా తగ్గిపోతాయి.

వెనిగర్ : టిష్యూ పేపర్‌ను తీసుకుని వెనిగర్‌లో ముంచి చెమట కాయలు ఉన్న ప్రదేశంలో అద్దాలి. ఇలా చేస్తే చెమట కాయలు త్వరగా తగ్గిపోతాయి.

లవంగ నూనె : కాటన్ బాల్‌ను తీసుకుని లవంగ నూనెలో ముంచి చెమటకాయలు ఉన్న ప్రదేశంలో రాస్తే చెమట కాయలు తగ్గుముఖం పడతాయి. తరచూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం కనిపిస్తుంది.

# హైడ్రేటెడ్‌గా ఉంటేనే.. అందం!



వేసవి వేడి.. మీ చర్మం తేమను కోల్పోయేలా చేస్తుంది. చర్మం పొడిబారి.. అందం బీటలు వారుతుంది. అంతేకాదు.. సూర్యుడి హానికరమైన యూవీ కిరణాలు.. చర్మంలో మెలనిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. తద్వారా చర్మం రంగు మారడంతోపాటు ముఖంపై నల్ల మచ్చలూ ఇబ్బంది పెడుతాయి. వీటినుంచి బయట పడాలంటే.. ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి పుష్కలంగా నీరు తాగాలి. రోజుకు కనీసం 8-10 గ్లాసులైనా తీసుకోవాలి. దీనివల్ల శరీరం నుంచి టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. చర్మం లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా మారుతుంది. నీటిశాతం అధికంగా ఉండే దోసకాయలు, పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీలను ఎక్కువగా తీసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడమే కాకుండా.. చర్మానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. ఆహారంలో యాంటి ఆక్సిడెంట్స్, విటమిన్ సి ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి యూవీ కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తాయి. విటమిన్ సి.. శరీరంలో ఫ్రీ రాడికల్స్‌తోపాటు మెలనిన్ ఉత్పత్తిని నిరోధిస్తుంది. నల్లమచ్చలు రాకుండా కాపాడుతుంది. ఇక ఎక్కువ సమయంపాటు ఏసీ గదుల్లో ఉన్నా.. చర్మం పొడిబారుతుంది. ఏసీల నుంచి వచ్చే పొడిగాలి.. చర్మంలో తేమను తొలగిస్తుంది. కాబట్టి, ఇంట్లో, కార్యాలయాల్లో హ్యూమిడిఫయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి గాలికి తేమను అందించి.. చర్మం ఎక్కువ పొడిగా మారకుండా నిరోధిస్తాయి. చర్మ సంరక్షణ కోసం కలబంద వంటి హైడ్రేటింగ్ పదార్థాలను కలిగిన మాయిశ్చరైజర్లు వాడాలి. ఇవి చర్మం తేమను కోల్పోకుండా కాపాడతాయి. చర్మాన్ని మృదువుగా మార్చడంలో సహాయపడతాయి. వేసవిలోనే కాదు.. ఏడాదంతా సన్‌స్క్రీన్ లోషన్ వాడటం మంచిది. ఇది హైపర్‌పిగ్మెంటేషన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. రసాయనాలు తక్కువగా ఉండే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇక వేసవిలో ప్రతి రెండుమూడు గంటలకు ఒకసారి సన్‌స్క్రీన్ లోషన్‌ను అప్లయి చేస్తూ ఉండాలి.


# జగన్ మారినట్టేనా

## సామాన్యులకు దొరకని అపాయింట్ మెంట్



గుంటూరు, : వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని గుర్తించాలి. తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి వచ్చి కలసి ఫొటోలు దిగి స్టేటస్ గా పెట్టుకున్న వారికే పదవులు ఇవ్వకుండా గ్రామాల్లో ఎవరు నిజంగా కష్టపడుతున్నారు? ఎవరికి జనంలో బలం ఉందన్నది చూడాలి. అది తెలుసుకోవాలంటే కేవలం కోటరీమీదనో.. స్థానిక నాయకుల మీదనో ఆధారపడితే మళ్లీ చరిత్ర పునరావృతమవుతుంది. ఎందుకంటే నాడు జరిగిన తప్పులే మళ్లీ జరగకుండా ఉండాలంటే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పెరగాలని కోరుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి జగన్ ను తాడేపల్లి కార్యాలయానికి కలవడానికి వచ్చిన వాళ్లకు ఇప్పటికీ జగన్ అపాయింట్ మెంట్ దొరకడం లేదు.జగన్ బయటకు వెళితే కార్యకర్తలు బాగానే వస్తున్నారు. వారు వస్తున్నది కూడా యాభై శాతం జగన్ మీద అభిమానం అయితే..మిగిలిన యాభై శాతం స్థానిక నాయకుల మీదన్న విషయం గుర్తుంచుకోవాలంటున్నారు. వైసీపీలో లో ఎప్పుడు నిజంగా కష్టపడే వాడికి ఫలితం దక్కేది ఎప్పుడంటూ సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి నియోజకవర్గంలోనూ రెండు మూడు వర్గాలున్నాయి. మాజీ ఎంపీ వర్గం, మాజీ ఎమ్మెల్యే వర్గం, జగన్ కి వ్యక్తిగత పరిచయం అని చెప్పుకునే మరొక వర్గం ఇలా మూడు గ్రూపులుగా అన్ని గ్రామాల్లో విడిపోయి తమ వర్గాల వారికి పదవులు ఇప్పించుకోవడానికి తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారుపార్టీ పదవుల నుంచి అన్నీ వారు చెప్పిన వారికే నాయకత్వం కూడా ఇస్తుండటంతో అసలైన, సిసలైన కార్యకర్త మాత్రం డీలా పడిపోయాడు. నియోజకవర్గ పదవులు వేసే క్రమంలో మూడు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో మూడు గ్రూపులుగా విడిపోయి నియోజకవర్గాల్లో వైసీపీ కార్యకర్తలు క్రాస్ రోడ్స్ లో ఉన్నారు. జగన్ వచ్చినప్పుడు అందరూ కలసి కట్టుగా కనిపిస్తున్నా ఆ తర్వాత మాత్రం ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరికి ఏ పదవి ఇవ్వాలని అనుకున్న దానికి ఇద్దరు ముగ్గురు పోటీ పడుతున్నారు. కార్యకర్తల అభీష్టాన్ని తెలుసుకొని ఇస్తే ప్రజాస్వామ్య బద్ధంగా ఎంపిక చేస్తే ఫలితం ఉంటుంది. అంతే తప్ప ఎవరో సిఫార్సుతో పదవులు ఇస్తే పార్టీ అధికారంలోకి రావడం కష్టమే. ఇప్పటికైనా జగన్ తెలుసుకోవాలి.

# వైసిపి పై కూటమి బ్రహ్మాస్త్రం సిద్ధం



విజయవాడ, : ఏపీ విషయంలో భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో సమావేశం కావడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన వెంటనే పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యారు. వారిద్దరి మధ్య సుదీర్ఘ భేటీ కొనసాగింది. ఇది సాధారణ భేటీ కాదని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని కూకటి వేళ్ళతో పెకిలించే భారీ వ్యూహంతో జరిగిన సమావేశం అని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లోని ప్రకంపనలు సృష్టిస్తోంది. ముమ్ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చాలా అంశాల్లో టార్గెట్ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.పవన్ ఢిల్లీ వెళ్లారు. అమిత్ షా తో భేటీ అయ్యారు. అటు నుంచి వచ్చిన వెంటనే జనసేన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే విషయంలో వైఫల్యాలను ప్రస్తావించారు. చివరకు తన సోదరుడు నాగబాబును సైతం తప్పు పడుతూ మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. తిరుమల లడ్డు వివాదానికి సంబంధించి ఎందుకు మాట్లాడలేదని కూడా ప్రశ్నించారు. అలా సొంత పార్టీ శ్రేణులను అప్రమత్తం చేసిన పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈరోజు మళ్లీ సీఎం చంద్రబాబు తో పాటు బిజెపి నేతలతో కూడా సంయుక్త సమావేశం నిర్వహిస్తున్నారు పవన్. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసుకుంటూ భారీ వ్యూహం సిద్ధమవుతున్నట్లు స్పష్టమవుతోంది.నెయ్యి వివాదానికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం చేపట్టిన విచారణ, దానికి సంబంధించి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేసింది. అయితే 36 మంది నిందితులుగా చూపింది. అందులో కల్తీ నెయ్యి సరఫరా చేసిన డైరీ యజమానులు, టిటిడి మాజీ ఉద్యోగుల పాత్ర బయటపడింది. నెయ్యి బదులు పామాయిల్ మిశ్రమాన్ని, కెమికల్స్ ను వాడి కోట్లాదిమంది భక్తుల నమ్మకాన్ని తాకట్టు పెట్టిన వారిని అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం బలమైన సందేశాన్ని పంపాలని నిర్ణయించింది. కేవలం అరెస్టులకి పరిమితం కాకుండా.. గత ప్రభుత్వంలోని కీలక నేతల ప్రమేయంపై ఆధారాలను ప్రజల ముందు ఉంచే ఆలోచనలో ఉంది కూటమి.ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలను ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేయనుంది కూటమి. ఈ అంశాన్ని కేవలం ఒక కేసుగా మాత్రమే కాకుండా.. హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో సామాన్య భక్తుల దగ్గరకు తీసుకెళ్లాలని చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఎదురుదాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టడమే కాకుండా.. వారు చేసిన తప్పులను ప్రజల వద్ద చర్చించేలా ప్రచార వ్యూహాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో ప్రజాక్షేత్రంలో భారీ బహిరంగ సభలు లేదా ధర్మరక్షణ యాత్రల ద్వారా ప్రజలకు వాస్తవాలను వివరించే అవకాశం ఉంది. ఈ విషయంపైనే పవన్ కళ్యాణ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో చర్చించారని.. ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత పవన్ ఈ విషయంపై సీఎం చంద్రబాబుతో చర్చించారని.. ఈరోజు రాష్ట్ర బిజెపి నేతలతో కలిసి భారీ వ్యూహరచన చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే టార్గెట్ అవుతుందన్నమాట.

# రాయలసీమకు మహర్ధశ



కర్నూలు, : ఆంధ్రప్రదేశ్‌లో మరో పోర్టుకు సంబంధించి లైన్ క్లియర్ అయ్యింది. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న దుగరాజుపట్నం పోర్టుకు సంబంధించిన భూసేకరణకు మార్గం సుగమం అయ్యింది. మొత్తం 2,170.70 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. ఇప్పటికే ఫీజుబులిటీ రిపోర్ట్ కూడా కేంద్రం దగ్గరకు వెళ్లింది. త్వరలోనే పోర్టుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పోర్టులపై ఫోకస్ పెట్టింది. కొన్ని ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండగా.. మరికొన్ని భూసేకరణ దశలో ఉన్నాయి. తాజాగా మరో కొత్త పోర్టుకు సంబంధించి అప్డేట్ వచ్చింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నేషనల్ మెగా నౌకానిర్మాణ క్లస్టర్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పోర్టుకు సంబంధించిన టెక్నికల్ ఫీజిబులిటీ నివేదికను రైట్స్ అనే సంస్థ సిద్ధం చేసి కేంద్రానికి పంపించారు. కేంద్రం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిందని.. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందంటున్నారు. దుగరాజపట్నం పోర్టుకు సంబంధించి అవసరమైన టెక్నికల్ సహకారాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీ అందిస్తుందని చెబుతున్నారు.కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేస్తారు. కేంద్రం బడ్జెట్‌లో మారిటైంకు సంబంధించి బడ్జెట్‌లో రూ.1,765 కోట్లు కేటాయించగా.. వీటి నుంచి ఎక్కువ వాటా దుగరాజపట్నం ప్రాజెక్టుకు వస్తుంది అంటున్నారు. దుగరాజపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు- షిప్ బిల్డింగ్ క్లస్టర్ కోసం భూముల్ని సేకరించనున్నారు. దీని కోసం 2,170.70 ఎకరాల భూమి కావాలని ఇటీవల నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా తిరుపతి జిల్లాలో 1,995.04 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 175.66 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది.తిరుపతి జిల్లాలోని వలమేడులో అత్యధికంగా 724 ఎకరాలు, ఆ తర్వాత వగ్రురులో 529 ఎకరాలు, పామంజిలో 489 ఎకరాలు, పాతేటిపాలెంలో 251 ఎకరాలు సేరించాలని భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో కోట మండలంలోని పుచ్చలపల్లిలో 129 ఎకరాలు, కొత్తపట్నంలో 46 ఎకరాలు సేకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం

రూ.544.30 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే పూర్తి వివరాలు తెలుస్తాయంటున్నారు.రాష్ట్ర విభజన సమయంలో చట్టం ప్రకారం పోర్టుకు అవసరమైన నిధులు కేంద్రం నుంచి సమకూర్చాల్సి ఉంటుంది. ఈ మేరకు దుగరాజపట్నం పోర్టు ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు రూ.30వేల కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే.. ప్రతి ఏటా ఏకంగా 5లక్షల టన్నుల సరకు రవాణా చేయొచ్చు.. పోర్టుతో పాటుగా షిప్‌యార్డు, నౌకానిర్మాణంతో పాటుగా మరమ్మతుల వ్యవస్థ కూడా చేయొచ్చు.

ఈ ప్రాజెక్టును మారిటైం బోర్డు, వీపీఏ (విశాఖపట్నం పోర్టు అథారిటీ) కలిసి అభివృద్ధి చేస్తాయి. వాస్తవానికి దుగరాజుపట్నం పోర్టు ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా ఉంది.. కానీ పేపర్ల వరకే పరిమితం అయ్యింది. ఇప్పుడు కేంద్రం సహకారంతో ఏపీ ప్రభుత్వం భూసేకరణ దిశగా అడుగులు వేస్తోంది.

# భారత ప్రామాణిక కాలమానం అమలు

1906 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది. భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం భారతదేశ మంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ సమయానికి ఐదున్నర గంటలు ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు-ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశంను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది. చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా "జీరో డిగ్రీల రేఖాంశం" అవంతీ నగరం దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి.సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహోరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహోరాత్రులు లేదా రోజులు ఉంటాయి. ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమాన మవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది. సూర్య సిద్ధాంతం, స్థానిక సమయము నుండి ఉజ్జయినీ ప్రామాణిక సమయాన్ని గణించే పద్ధతిని కూడా వివరించింది. భారతీయ కాలమానం చాలా ముందే ఈ ప్రగతిని సాధించినప్పటికీ, ప్రామాణిక సమయం, ఖగోళ శాస్త్రంలో తప్ప వేరెక్కడా విరివిగా ఉపయోగించ బడలేదు.భారతదేశాన్ని పరిపాలించిన రాజులు, తమ సామ్రాజ్యాలలో, చాలా వరకు భారతీయ పంచాంగం సహాయముతో గణించిన స్థానిక సమయాన్నే పాటించారు.పూర్వపు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు ఉపయోగించే రోజు ఉజ్జయిని లోని ప్రైమ్ మెరీడియన్ వద్ద సూర్యుడు ఉదయించ డముతో ప్రారంభ మవుతుంది. అలా ప్రారంభ మయిన రోజు చిన్న చిన్న సమయ ఖండాలుగా విభజించ బడినది. 1884లో, వాషింగ్టన్, డి.సిలో జరిగిన అంతర్జాతీయ మెరిడియన్ సమావేశం ప్రపంచమంతటా ప్రామాణిక కాలమండలాలను వ్యవస్థీకరించింది. ఆ సమావేశంలో భారతదేశంలో రెండు కాల మండలాలు ఉండాలని నిర్ణయిం చింది. కలకత్తా తూర్పు 90 డిగ్రీల రేఖాంశంను, బొంబాయి తూర్పు 75డిగ్రీల రేఖాంశం ఉపయోగించేది.

# రెండో దశ మెట్రో పై బిగ్ అప్ డేట్

హైదరాబాద్, : హైదరాబాద్ నగరవాసులకు మెట్రో గుడ్‌న్యూస్ చెప్పింది. రెండో విడత విస్తరణకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చింది. మొత్తం ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గాలను నిర్మించనున్నారు. నాగోల్-శంషాబాద్.. రాయదుర్గం-నియోపోలిస్.. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట.. మియాపూర్-పటాన్ చెరు.. ఎల్బీ నగర్-హయత్ నగర్ మార్గాల్లో మెట్రో అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు రూ.24,269 కోట్ల అంచనా వ్యయం అవుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా.. దాని వల్ల పెరుగుతున్న ట్రాఫిక్‌ను పెరగకుండా ఉంచేందుకు ఈ మెట్రో రెండో దశ విస్తరణ చాలా కీలకం కానుంది.హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై బిగ్ అప్‌డేట్ వచ్చింది. మెట్రో విస్తరణలో భాగంగా రెండో దశలో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గం నిర్మించనున్నారు. హైదరాబాద్ నగరవాసులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంతోపాటు.. నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో రైలును విస్తరించేందుకు ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మెట్రో విస్తరణ జరిగితే.. లక్షలాది మంది నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. మెట్రో ఫేజ్-2కు సంబంధించి హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ తాజాగా ఒక



ప్రకటనను రిలీజ్ చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.24,269 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా కొత్తగా మరో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాలు ఏర్పాటు కానున్నాయి. ఇక ఈ మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి ఇప్పటికే తెలంగాణ సర్కార్.. పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన రిపోర్ట్‌ను కూడా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

# అమరావతి ఓఆర్ఆర్ 250 అడుగులు

అమరావతి, : ఏపీ రాజధాని అమరావతికి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసి భూమిని సేకరిస్తున్నారు.ఈ క్రమంలో ఓఆర్ఆర్ భూసేకరణ 140 మీటర్ల వెడల్పు బదులు 250 మీటర్ల వెడల్పు కోసం చేపడుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో రైతులు ఆందోళన వ్యక్తం చేయగా.. అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఆందోళన అవసరం లేదన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అన్ని జిల్లాలు కనెక్ట్ చేసేలా ఔటర్ రింగ్ రోడ్డు రాబోతోంది. అమరావతి ఓఆర్ఆర్‌కు సంబంధించి భూసేరణ ప్రక్రియ కూడా చేపట్టారు. గుంటూరు, పల్నాడుతో పాటుగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూసేకరణ చేపట్టారు. అయితే ఓఆర్ఆర్‌ను 140 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారని ప్రతిపాదించారు. అయితే అమరావతి ఔటర్‌కు సంబంధించిన గెజిట్‌లో మాత్రం 250 మీటర్లుగా పేర్కొన్నారట. దీంతో రైతులు అధికారుల్ని అడిగి క్లారిటీ తీసుకుంటున్నారట.. 250 మీటర్లు ముందు జాగ్రత్త మాత్రమేనని.. ఓఆర్ఆర్‌ను మాత్రం 140 మీటర్ల వెడల్పుతోనే నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారట.

మామూలుగా అధికారులకు 3ఏ నోటిషికేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండా భూమి సర్వేకు హక్కు ఉండదు అంటున్నారు. అప్పుడు కొలతలు తీసి హద్దులు వేయలేరని.. జీపీఎస్‌పై ఆధారపడాలి అంటున్నారు. జీపీఎస్‌ను 140 మీటర్ల వెడల్పు ప్రామాణికంగా తీసుకుని హద్దులు నిర్ణయిస్తే.. కొన్ని చోట్ల 5 నుంచి 10 మీటర్లు తేడా వస్తుంది అంటున్నారు. అదే జరిగితే ఈ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని.. ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందంటున్నారు. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొన్నారట. భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత సర్వే పూర్తి చేసిన అనంతరం 140 మీటర్లకే కొలత వేసి సరిహద్దులు వేస్తారు. ఆ మేరకు మాత్రమే భూమిని కూడా తీసుకుంటారు.. ఈ అంశాలను తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారని చెబుతున్నారు. ఎవరికి ఆందోళన అవసరం లేదంటున్నారు.

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో భూసేకరణ కోసం గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో ఓఆర్ఆర్ 140 బదులుగా 250 మీటర్ల భూసేకరణ ఉంటుందని పేర్కొన్నారు. అందుకే రైతులు ఒకింత ఆందోళనలో ఉన్నారట.

## సిరిపురం ప్రత్యేక పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

మంథని: మంథని మండలం సిరిపురం గ్రామంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ,పెద్దపెల్లి జిల్లా కలెక్టర్, జిల్లా పశు వైద్య పశు సంవర్ధక శాఖ పెద్దపల్లి జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఏడు రోజుల కార్యక్రమం లో భాగంగా 6 వ రోజు మంథని మండలం సిరిపురం గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించగా విశేష స్పందన లభించింది.. ఈ ప్రత్యేక పశు వైద్య శిభిరం లో జబ్బు పడిన 483 పశువులకు చికిత్స, 182 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

(గాలికుంటు, ముద్దచర్మవ్యాధి మరియు రేబిస్ టీకాలు) వేశారు. అంతే కాకుండా పాడి పశువుల,జీవాల యజమాన్య పద్దతులు,పశు పోషణ మరియు వివిధ రకాలపశు గ్రాసాలపై సాగుపై పాడి రైతులకుఅవగాహన కల్పించ డం జరిగిందని మంథని మండల పశు వైద్య అధికారి డాక్టర్ టి.రవి కుమార్ వెల్లడించారు.

# రోజుల్లోనే 800 మందికిపైగా మిస్సింగ్

న్యూఢిల్లీ ఢిల్లీలో మిస్సింగ్ కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది మొదటి 15 రోజుల్లోనే 500మందికిపైగా మహిళలు, బాలికలు సహా 800 మది ఆచూకీ లేకుండాపోయారు. ఇవేవో ప్రతిపక్షాలు, హక్కుల సంఘాలు చేస్తున్న ఆరోపణలు కాదు. పోలీసుల రికార్డులే ఇవి చెబుతున్నాయి. జనవరి 1 నుంచి 15 మధ్య నమోదయిన మిస్సింగ్ కేసుల్లో కేవలం 235 మంది ఆచూకీ గుర్తించారు. ఇక, తప్పిపోయిన వారిలో ఎక్కువ శాతం వయోజనులే ఉన్నారు.అయితే, అదృశ్యమైనవారిలో 235 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. మిగతా 572 మంది ఏమయ్యారో తెలియరాలేదని పోలీసుల రికార్డులు చూపుతున్నాయి. అలాగే, కనిపించకుండాపోయిన మొత్తం కేసుల్లో 191 మంది మైనర్లు ఉండటంతో బాలల భద్రతపై ఆందోళనను ఇది ఎత్తిచూపుతోంది. వీరిలో ఎక్కువ మంది బాలికలే (145 బాలికలు, 45 మది బాలురు) కావడం మరింత కలవరానికి గురిచేస్తోంది. తప్పిపోయిన మైనర్లలో ఎక్కువ మంది టీనేజర్లు ఉన్నారు. ఈ కాలంలో 169 మంది టీనేజర్లు తప్పిపోయినట్లు గుర్తించారు. వారిలో 138 మంది బాలికలు, 31 మంది బాలురు. ఈ టీనేజర్ కేసులలో దాదాపు 71 శాతం ఇప్పటికీ పరిష్కారం కాలేదని పోలీసు డేటా సూచిస్తుంది.అలాగే, 8 నుంచి 12 ఏళ్లలోపు పిల్లలు 13 మంది అదృశ్యమయ్యారు. వీరిలో ఎనిమిది మంది అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలు ఉన్నారు. ఎనిమిదేళ్లలోపు పిల్లలు 9 మంది ఆచూకీ కానరాలేదు. వీరిలో ఆరుగురు చిన్నారులను పోలీసులు రక్షించారు. జాడలేని వ్యక్తులలో వయోజనులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 363 మంది మహిళలు, 253 మంది పురుషులతో సహా మొత్తం 616 మంది వయోజనులు అదృశ్యమైనట్లుగా గుర్తించారు. వీరిలో 181 మంది జాడను పోలీసులు గుర్తించగా.. 435 కేసులు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయి.తాజా గణాంకాలు రాజధానిలో నెలకొన్న దీర్ఘకాలిక ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. గతేడాది ఢిల్లీలో 24,500కు పైగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి, వీరిలో 60 శాతానికి పైగా మహిళలే ఉన్నారు. దశాబ్దల గణాంకాల విశ్లేషణ ప్రకారం.. గత 10 ఏళ్లలో నగరంలో దాదాపు2.3 లక్షల మంది అదృశ్యమయ్యారు,



# ముందుచూపు

భగభగమండే ఎండల తరువాత మొదలయ్యే ఖరీఫ్ కాలం... అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా మామూలే! విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి ... తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇందులో సాగునీటికి అవసరమైన వర్షాలు తప్ప మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందుచూపుతో ముడిపడి ఉన్నవే! అయినా, ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వహించటం వల్ల, ముందస్తుగా అవసరమైనన్ని విత్తనాలూ, ఎరువులూ సమకూర్చకపోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గుర్రై, గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా వస్తోంది. పుండు మీద కారం చల్లినట్టు– ఈసారి ఈ కష్టాలన్నింటికీ తోడు ఒకవైపు అమెరికా యుద్ధోన్మాద పర్యవసానం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈపాటికే హెచ్చరించింది. ఈ కారణాలను సాకుగా చూపించి, చేతులు ఎత్తేయకుండా– ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకులు తమ తక్షణ కర్తవ్యంగా పెట్టుకోవాలి.

చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం మరొక శరాఘాతం. ఏటా 600 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను మనదేశంలో ఉపయోగిస్తున్నారు. ఇందులో అత్యధికం మనదేశంలోనే తయారవుతున్నప్పటికీ– ముడిసరుకుల కోసం దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప– అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోయి, కష్టకాలం దాపురించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే – జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. సాగుకు అవసరమైన సరంజామాను సమకూర్చాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. మే 15 నాటికే కాలువల్లో నీరు విడుదల చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అయితే, పొలాలకు ముందుగా నీరివ్వటంతోనే సరిపోదు. అంతకన్నా ముందుగానే అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. నీటిఎద్దడి పరిస్థితి ఎదురైతే– ఏం చేయాలో అవసరమైన సన్నాహాలు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ ... పాలకులు ప్రదర్శించే ముందుచూపే రైతాంగానికి రక్ష. అయితే, అది మాటలకు, ప్రకటనలకు పరిమితం కాకుండా ఆచరణలో చూపటం నేడు చాలా అవసరం.

## జూ నుంచి అదృశ్యమైన తోడేలు..

### 9 రోజుల తర్వాత మళ్లీ చిక్కింది.. దేశవ్యాప్తంగా సంబరాలు



సియోల్: దక్షిణకొరియాలో డేజియాన్‌లో ఉన్న ఓ–వరల్డ్ జూ నుంచి తోడేలు తప్పించుకున్నది. అదృశ్యమైన 9 రోజుల తర్వాత దాన్ని మళ్లీ బంధించారు. అయితే రెండేళ్ల ఆ తోడేలు జూ నుంచి తప్పించుకోవడంతో.. దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. అయితే దాన్ని తిరిగి బంధించిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. జూ నుంచి పరారీ అయిన తోడేలును న్యూకుగు పేరుతో పిలిచేవారు. ఏప్రిల్ 8వ తేదీన ఈ ఘటన జరిగింది. జూ నుంచి తోడేలు కనిపించకుండాపోవడంతో, దాని భద్రతపై దేశ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. జూ బయట ఆ తోడేలు బ్రతుకుతుందా అని జనం ఆందోళనపట్టారు. జంతు ప్రేమికులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. ఓ దశలో న్యూకుగు తోడేలు గురించి దేశాధ్యక్షుడు లీ జేయి ముంగ్ కూడా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రకటన చేశారు. తోడేలును పట్టుకునేందుకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, మిలిటరీ ప్రయత్నం చేశాయి. డ్రోన్లతో తీవ్ర గాలింపు చేపట్టారు. తోడేలు మళ్లీ చిక్కడంతో సోషల్‌మీడియాలో అభిమానులు సంబరాల పోస్టులను చేశారు. న్యూకుగు సురక్షితంగా తిరిగివచ్చిందని, దీనిపై తన ఫేస్‌బుక్ పేజీలో డేజియాన్ మేయర్ లీ జాంగ్ వూ ఓ కథనాన్ని రాశారు. 2008లో రష్యా నుంచి దక్షిణకొరియా తోడేళ్లను తీసుకువచ్చింది. వాటికి చెందిన మూడో జనరేషన్ సంతానం ఇది. తాజా ఘటన నేపథ్యంలో జూలో సెక్యూర్టీ పెంచనున్నట్లు అధికారులు తెలిపారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించండి

## తహసిల్దార్ కు ,పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు వినతి




జూలూరుపాడు:దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని మండల పరిధిలో ఉన్న పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈరోజు తాసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ ఇతర వర్గాలకు లేని మత పరిమితులు దళితులకు ఎందుకు,సుప్రీంకోర్టు తీర్పు పై ఆందోళన ,1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దుకు పిలుపు,దళిత క్రైస్తవులపై అమల్లో ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని, లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించాలని పాస్టర్ వేపూరి నతానియల్ రాజ్ డిమాండ్ చేశారు.ఈ ఉత్తర్వులు దళితులకు మత స్వేచ్ఛపై రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ,15, 25, లకు విరుద్ధమని వారు ఆవేదన వ్యక్తం చేశారు, దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని అన్నారు, ఇతర వర్గాలైన ఓసి, బీసీ ఎస్టీలకు లేని మత పరిమితులు ఎస్సీలకు ఎందుకు విధిస్తున్నారు కేంద్ర ప్రభుత్వం స్పష్టంత ఇవ్వాలి, బౌద్ధం సిక్కు మతంలో మారిన దళితులకు ఎస్సీ హోదా కొనసాగుతుండగా క్రైస్తవ్యం మతంలోకి మారిన దళితులకు నిరాకరించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పూర్తిగా అసమానతలను ప్రతిబింబిస్తున్నాయని వాటిని ప్రస్తుతం రాష్ట్రపతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు, చారిత్రాత్మకంగా దళితుల విద్యా ఆరోగ్యం పురోగ తిలో క్రైస్తవ మిషనరీలు కీలక పాత్ర పోషించారని, ఆ నేపథ్యంలో మారిపిడి అయినా దళితులను శిక్షించేలా విధానాలు ఉండకూడదని అన్నారు, ఏ మతంలో ఉండాలన్నది వారి వ్యక్తిగత నిర్ణయం అని దానిపై ఎవరు ఆంక్షలు విధించే హక్కు లేదని స్పష్టం చేశారు, జ్యోతి రావు పూలే అంబేద్కర్ స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ గారి నాయక త్వంలో ఈ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జూలూరుపాడు మండల అధ్యక్షుడు దెబ్బేందుల సాయికుమార్, మాజీ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ మాలోత్ కబీర్ దాస్, పాస్టర్ శ్రీకాంత్, పాస్టర్ ఇస్సాకు, పాస్టర్ తిమోతి, ఫాస్టర్ ఎలీషా, పాస్టర్ పౌలు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం టు భోగాపురం ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి ప్లాన్

విశాఖపట్టణం, : భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.. అన్నీ కుదిరితే జులై, లేని పక్షంలో ఆగస్టు నెలలో ప్రారంభించే అవకాశం ఉంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖపట్నంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్ట్‌ను నేవీకి అప్పగించనున్నారు. అప్పుడు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు పెరుగుతాయి. అయితే ఆనందపురం దగ్గర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండటంతో కొత్తగా ఫ్లై ఓవర్ ప్లాన్ చేశారు.. అలైన్‌మెంట్ ఫైనల్ చేసి డీపీఆర్ కోసం పంపారు. విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేవారికి కీలకమైన ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.ఈ క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని గ్రహించి ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టే దిశగా ఆలోచన చేశారు. ఆనందపురం జంక్షన్ మీదుగా.. విశాఖపట్నం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు.. అటు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేలా కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఆనందపురం జంక్షన్ దగ్గర భోగాపురం వైపు వెళ్లేలా కొత్తగా ఓ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం వచ్చిన సమయంలో కొత్త ఫ్లై ఓవర్ గురించి ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనలకు సీఎం ఓకే చెప్పడంతో అధికారులు ఈ ఫ్లై ఓవర్‌కు సంబంధించి అలైన్‌మెంట్ ఖరారు చేశారు. 45 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేసి.. ఆమోదం రాగానే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఇటీవల ఆనందపురం జంక్షన్, కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌లను ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు.. ప్రస్తుతం ఆనందపురం జంక్షన్ దగ్గర ఉన్న మార్కెట్‌ను మరోచోటికి తరలించాలని ఆలోచన చేస్తున్నారు. ఈ మార్కెట్‌ను తరలిస్తే.. రాబోయే రోజుల్లో ఆనందపురం జంక్షన్ దగ్గర భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఈ అంశంపై కూడా ఫోకస్ పెట్టిన అధికారులు.. శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇటు అనకాపల్లి వెళ్లే వాహనాలు, అటు భోగాపురం వైపు వెళ్లే వాహనాలకు ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.మరోవైపు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ ఢ బీ శాఖలు ఈ రోడ్ల పనులు జరుగుతున్నాయి. విశాఖపట్నం ఎంపీ భరత్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్‌లు ఈ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. తిమ్మాపురం నుంచి మారికవలస రోడ్డు రహదారి పనులు ముగింపు దశకు వచ్చాయని ఎంపీ భరత్ తెలిపారు. అడవివరం నుంచి శొంఠ్యాం ఆరు లేన్ల రోడ్డుకు అనుమతులు వచ్చాయని.. ఆ పనులు ఊపందుకు న్నాయ న్నారు. నేరళవలస–కొత్తవలస, బోయపాలెం–కాపులుప్పాడ రహదారు లు ఏప్రిల్ చివరినాటికి పూర్తవుతాయన్నారు.పెందుర్తి ప్రాంతంలోని రోడ్డు పనులు మే–జూన్ నాటికి పూర్తి చేసే అవకాశం ఉందని భరత్ తెలిపారు. భీమిలి టు దొరతోట రోడ్డును 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ రోడ్లను నేషనల్ హైవేలతో అనుసంధానానికి ఇప్పటికే అనుమతులు లభించాయన్నారు. జూన్ నాటికి విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఏడు కీలకమైన రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# 22 శాతం మందికే లక్ష పైన ఆదాయం

## ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలు



హైదరాబాద్, : తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ. లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే 3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది. అదే సమయంలో మొత్తం 242 కులాలు ఉండగా.. అందులో 135 కులాలను అత్యంత వెనుకబడినవిగా గుర్తించారు.తెలంగాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమం లోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం.. ఎస్సీల్లో 97 శాతం..బీసీల్లో 71శాతం మంది ప్రజలు..తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుక బడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కు వగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన వారే కావడం గమనార్హం..

సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య చదువుతున్న వారిలో 57 శాతంతో అగ్రవర్ణాలు ముందుండగా.. 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.

# దొరికినట్టే దొరికి తప్పించుకున్న నిదా ఖాన్..

## టీసీఎస్ నాసిక్ కేసులో కీలక పరిణామం

**నిదా ఖాన్ భర్తను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు**
**ఆమె లొకేషన్ వివరాలు వెల్లడించిన భర్త**
**పోలీసులు వెళ్లేసరికే ఇంటికి తాళం వేసి పరారీ**



ఢిల్లీ,:టీసీఎస్ నాసిక్ వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదా ఖాన్ ఆచూకీ వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. ఆమె భర్త స్వయంగా ఆచూకీ చెప్పినప్పటికీ, పోలీసుల రాకను పసిగట్టిన నిదా ఖాన్ అక్కడి నుంచి పరారైంది. దీంతో ఈ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. విచారణలో భాగంగా పోలీసులు నిదాఖాన్ భర్తను ప్రశ్నించగా, ఆయన పోలీసులకు సహకరించాడు. తన భార్య ప్రస్తుతం ఎక్కడ ఉంటోందో స్పష్టమైన సమాచారం అందించాడు.ఆ లొకేషన్ ఆధారంగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అయితే, వారు వెళ్లేసరికే ఆ ఇంటికి తాళం వేసి ఉండటంతో అధికారులు అవాక్కయ్యారు. పోలీసులు వస్తారని ఊహించి నిదా ఖాన్ అక్కడి నుంచి తప్పించుకుంది. టీసీఎస్‌లో హెచ్ ఆర్ విభాగంలో పనిచేసిన నిదా ఖాన్ పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. టీమ్ లీడర్లు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పైపెచ్చు నిందితులకు మద్దతుగా నిలిచిందని, మతం మారాలంటూ బాధితులపై ఒత్తిడి తెచ్చినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులను టార్గెట్ చేసి బలవంతంగా మతమార్పిడులకు పాల్పడేందుకు పథకం ప్రకారమే నిదా ఖాన్ వ్యవహరించిందని అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు మొత్తం 9 ఎఫ్ఐఆర్ లు నమోదు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. లైంగిక వేధింపులకు పాల్పడిన టీమ్ లీడర్లను అరెస్టు చేశారు. అయితే, ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న నిదా ఖాన్ మాత్రం పరారీలో ఉంది. దీంతో ఆమె కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిదా ఖాన్ తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయడంతో ఆమెను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. ఆమెకు ఎవరైనా ఆశ్రయం కల్పిస్తున్నారా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితురాలి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల్లో సైతం గాలింపు చర్యలు చేపట్టారు.


### అరకు లోయలో దారుణం.. నాటు తుపాకీతో కాల్పులు

అల్లూరి జిలా: అల్లూరి జిలా అరకు లోయలో భూమి కోసం సాగుతున్న గొడవలు చివరకు ప్రాణాల మీదకు తెచ్చాయి. డూమ్రీగూడ మండలం పోతంగి పంచాయతీలో బంధువుల మధ్య ఉన్న పాత భూతగాదాలు ఒక్కసారిగా హింసాత్మకంగా మారాయి. మాట మాట పెరగడంతో తీవ్ర ఆవేశానికి లోనైన లక్ష్మణరావు అనే వ్యక్తి, తన బంధువైన కిల్లోబి మల్లుపై నాటు తుపాకీ తో కాల్పులు జరిపాడు.

ప్రశాంతంగా ఉండే మన్యం ప్రాంతంలో ఈ తుపాకీ మోత ఒక్కసారిగా కలకలం సృష్టించింది. ఈ కాల్పుల్లో కిల్లోబి మల్లు శరీరంలోకి బుల్లెట్లు దూసుకుపోవడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. రక్తపు మడుగులో పడి ఉన్న మల్లును గమనించిన స్థానికులు వెంటనే స్పందించి

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భూమి కోసం కన్నవారిని, బంధువులను కూడా లెక్కచేయకుండా ఇలాంటి దారుణానికి ఒడిగట్టడం స్థానికంగా కలకలం రేగింది.

# పురుషుల్లో రొమ్ము క్యాన్సర్



హైదరాబాద్, : ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటి మందిని క్యాన్సర్ మహమ్మారి బలిగొంటుండగా.. పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోంది. రొమ్ము క్యాన్సర్ కేవలం మహిళలకే వస్తుందన్న అపోహ వల్ల పురుషులు లక్షణాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా 87 శాతం కేసులు చివరి దశలో బయటపడుతున్నాయని సనత్‌నగర్ ఈఎస్ఐసీ అధ్యయనం వెల్లడించింది. ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయగలిగే ఈ వ్యాధిని అవగాహన లోపం వల్ల ప్రాణాంతకంగా మార్చుకుంటున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రపంచాన్ని శరవేగంగా కబళిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు కోటి మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలోనూ లక్షల సంఖ్యలో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఒకసారి క్యాన్సర్ బారిన పడితే బయటపడడం చాలా కష్టం. చికిత్స తీసుకుంటూనే మరెన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక రొమ్ము క్యాన్సర్ అనగానే కేవలం మహిళలకు మాత్రమే వచ్చే వ్యాధిగా సమాజంలో ఒక బలమైన ముద్ర ఉంది. కానీ, పురుషుల్లో కూడా ఈ వ్యాధి ప్రబలుతోందని, అది కూడా ప్రాణాంతకమైన చివరి దశలో బయటపడుతోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ 2019 నుంచి 2025 మధ్య కాలంలో నిర్వహించిన ఒక ప్రత్యేక అధ్యయనంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.ఈఎస్ఐసీ అధ్యయనంలో పాల్గొన్న 15 మంది రోగుల డేటాను విశ్లేషించగా.. అందులో 60 శాతం మంది థర్డ్ స్టేజ్‌లో, 26.7 శాతం మంది ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నప్పుడు మొదటిసారి డాక్టర్‌ను సంప్రదించారు. అంటే సుమారు 87 శాతం మందిలో క్యాన్సర్ శరీరం అంతటా వ్యాపించిన తర్వాతే చికిత్స ప్రారంభమైంది. లక్షణాలు కనిపించినప్పటి నుంచి వ్యాధి నిర్ధారణ అయ్యే వరకు సగటున ఆరు నెలల జాప్యం జరుగుతోందని డాక్టర్లు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న రోగులలో చాలా మందికి చనుమొన వెనుక గడ్డలు, చర్మం మెద్దుబారటం, చనుమొన లోపలికి కుంచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. ఇద్దరు రోగులలోనైతే వ్యాధి తీవ్రత పెరిగి పుండ్లు కూడా పడ్డాయి. ఇటువంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు.ఈఎస్ఐసీ ఆంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ గుమ్దల్ విశేష్ మాట్లాడుతూ.. ఆయా రోగుల్లో ఎవరికీ ఫ్యామిలీలో క్యాన్సర్ హిస్టరీ, హార్మోన్ల సమస్యలు వంటి ముందస్తు ముప్పు కారకాలు లేవని చెప్పారు. పురుషుల్లో ఈ వ్యాధి అరుదు కావడంతో.. ప్రారంభ లక్షణాలను తప్పుగా అర్థం చేసుకోవడమే ఈ జాప్యానికి కారణమని అంటున్నారు. ఇక 2025లో జరిగిన ఫాలోఅప్ ప్రకారం.. 60 శాతం మంది రోగులు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఇద్దరు వ్యాధి తీవ్రతతో మరణించగా..26.7 శాతం మంది చికిత్స ఆపేశారు. ఈఎస్ఐసీలో ఉచిత చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ.. సుదూర ప్రయాణాలు, సామాజిక వివక్ష, అవగాహన లోపం వల్ల రోగులు చికిత్సకు దూరమవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు.మహిళల రొమ్ము క్యాన్సర్‌పై ఉన్నంత అవగాహన పురుషుల విషయంలో లేకపోవడం పెద్ద లోపంగా మారిందని అంటున్నారు. పురుషుల కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ మార్గదర్శకాలు లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. పబ్లిక్ హెల్త్ మెసేజింగ్‌లో పురుషుల రొమ్ము క్యాన్సర్‌ను కూడా చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా గుర్తించడం వల్ల డేటా సేకరణ మెరుగుపడుతుందని అయితే జాతీయ స్థాయిలో దీనిపై ప్రత్యేక విధానాలు రావాలని నిపుణులు కోరుతున్నారు

# తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిస్తే సహించేది లేదు



వనపర్తి:పార్లమెంట్ వేదికగా తెలంగాణ ఏర్పాటును అవమానపరిచేలా బిజెపి ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద లక్కాకుల సతీష్ నేతృత్వంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. తేజస్వీ సూర్యతో పాటు, తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో విఫలమైన రాష్ట్ర బిజెపి ఎంపీల దిష్టిబొమ్మలను నిరసనకారులు దహనం చేశారు. ఈ సందర్భంగా లక్కాకుల సతీష్ మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి, ప్రాణ త్యాగాలను గౌరవిస్తూ సోనియా గాంధీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని గుర్తుచేశారు.దేశ విభజన నాటి రక్తపాతంతో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన తెలంగాణను పోల్చడం కోట్లాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం అనేది అమరవీరుల త్యాగాల ఫలం అటువంటి పవిత్రమైన పోరాటాన్ని భారత విభజనతో పోల్చడం తేజస్వీ సూర్య అజ్ఞానానికి నిదర్శనం. వెంటనే ఆయన తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. పార్లమెంట్‌లో తెలంగాణను అవమానిస్తుంటే నోరు మెదపని రాష్ట్ర బిజెపి ఎంపీలు రాజీనామా చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కాకుల సతీష్ బాపంపల్లి వెంకటేష్ బోయ మురళి , రాజా నర్సింహ జిల్లా ఆర్టీఏ సభ్యులు జహాగీర్ మార్కెట్ డైరెక్టర్ లతీఫ్‌సూరిఅయూబ్ ఖాన్ వసీం ఇర్ఫాన్ పాషా యదిగిరి జయానంద్ తిరుపతి కందికొండ శ్రీను బురనుద్దీన్ వినోద్ చారి షేక్ బషీర్,మన్సూర్ అస్లాం ఆర్టీ కిరణ్ ఫాజిల్ వక్ఫ్ బోర్డు సభ్యులు సలీం ఎన్ఎస్‌యుఐ నాయకులు బి.శ్రీకాంత్ అనిల్ అబ్రార్ నరేష్ మతీన్ రాజు అశోక్ అమర్ యాసిన్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

# కీలకం కానున్న 70 నియోజకవర్గాలు..

కోల్ కత్తా, : ఈసారి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. మూడుసార్లు అధికారంలోకి వచ్చిన మమత.. ఈసారి కూడా తమదే అధికారం అని స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. అలాగని తాము ఈసారి అధికారంలోకి వస్తామని బిజెపి నాయకులు కూడా చెప్పుకోలేని దుస్థితి. ఈసారి ఎన్నడు లేని విధంగా బెంగాల్ ప్రజలు చాలా నిశ్శబ్దంగా ఉన్నారు.. అనేక సర్వే సంస్థలు రకరకాల వివరాలు వెల్లడిస్తున్నప్పటికీ.. బెంగాల్ ప్రజల నాడి అంత ఈజీగా దొరకడం లేదుఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ ద్వారా 91 లక్షల ఓట్లను తొలగించారు. దీంతో బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికల పోరు అత్యంత ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి కొన్ని చోట్ల 2021 ఎన్నికల్లో అభ్యర్థులు గెలిచిన మెజార్టీ కంటే ఎస్ఐఆర్ ద్వారా పోయిన నకిలీ ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో 11 జిల్లాలోని 70 అసెంబ్లీ స్థానాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాలలో అత్యంత కీలకపాత్ర పోషించే అవకాశం కనిపిస్తోంది. ఇందులో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోటీ చేసి ఓడిపోయిన నందిగ్రామ్, ఉప ఎన్నికల్లో గెలిచిన భవానిపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో బెంగాల్ రాష్ట్రంలో వరస సంఘటనలు జరిగాయి. అవి మమత బెనర్జీ ప్రభుత్వాన్ని తీవ్రమైన ఇరకాటంలో పడేశాయి. స్పందన బెనర్జీ బయటికి రాలేక తప్పలేదు. కాకపోతే ఆమె డిఫెన్స్ చేస్తున్న విధానం ఓటర్లకు అంత ఈజీగా ఎక్కడం లేదు.. మెడికో విద్యార్థిని పై దారుణం.. అధికార తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల ఘోరాలు.. పెరిగిపోయిన అవినీతి.. కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులను ఇబ్బంది పెట్టడం వంటి పరిణామాలు మమత బెనర్జీకి వ్యతిరే కంగా మారిపోయాయి.. అయితే వాటిపై క్లారిటీ ఇవ్వడంలో మమత పూర్తిగా విఫలమవుతున్నారు. అందువల్లే ఎన్నికల ప్రచారంలో ఆమె మునుపటి జోరు చూపించలేకపోతున్నారు.ఇక బిజెపి కూడా ప్రచార శైలిలో కాస్త దూకుడు చూపిస్తున్నప్పటికీ.. ప్రజలను మెప్పించే స్థాయి లో అది సాగలేకపోతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నప్పటికీ.. బిజెపికి ఏకపక్షంగా సీట్లు వచ్చే పరిస్థితి లేదని అనేక రకాలైన విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి. అటు అధికార తృణమూల్ కాంగ్రెస్.. ఇటు ప్రతిపక్ష బిజెపి హోరా హోరిగా పోరాడుతున్నాయి. ఈ రెండు పార్టీలు ఎన్నికల ప్రచారంలో నువ్వా నేనా అన్నట్టుగా సాగుతున్నప్పటికీ 11 జిల్లాలోని 70 స్థానాలే బెంగాల్ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని విశ్లేషణలను వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ 70 నియోజకవర్గాలలో అటు బిజెపి.. ఇటు తృణమూల్ కాంగ్రెస్ చావో రేవో అన్నట్టుగా ప్రచారం చేస్తున్నా యి. ఒకవేళ బిజెపి గనుక అధికారంలోకి వస్తే మమతా బెనర్జీ అక్రమాలపై దర్యాప్తు చేపడతామని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బెంగాల్ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రాదని.. బిజెపి మత రాజకీయాలకు బెంగాల్ ప్రజలు ఆకర్షితులు కాలేరని తృణమూల్ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. మొన్నటిదాకా చేపల పంచాయతీ.. ఇప్పుడేమో 70 నియోజకవర్గాల వ్యవహారం.. మొత్తానికి పశ్చిమ బెంగాల్ ఎన్నికలు నిత్యం అటు జాతీయ మీడియాలో.. ఇటు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తూనే ఉన్నాయి.

# ఆటోడ్రైవర్‌ను బలితీసుకున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్


దుండిగల్: బెట్టింగ్ యాప్ ఉచ్చులో పడి ఓ ఆటోడ్రైవర్ ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఓఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో గేమ్స్ఆడి డబ్బులు పోవడంతో మనస్థాపానికి గురైన ఓ ఆటో డ్రైవర్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సోంపాల్ (32) అనే వ్యక్తి 8 ఏళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వలస వచ్చి దుండిగల్ తండా-2 లో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ ఆడే అలవాటు ఉన్న సోంపాల్ శుక్రవారంరూ.30 వేలు పోగొట్టుకున్నాడు.అయితే ఈవిషయం ఇంట్లో తన భార్యకు తెలిస్తే గొడవ జరుగుతుందని తీవ్ర మానసిక ఆందోళ నకు గురైన సోంపాల్ రాత్రి తన గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మురుగు నీటికి ఫుల్ డిమాండ్

హైదరాబాద్, : వ్యర్థ జలాల పునర్వినియోగం కోసం హైదరాబాద్ జలమండలి వినూత్న కార్యక్రమానికి రెడీ అయింది. గేటెడ్ కమ్యూనిటీల నుంచి శుద్ధి చేసిన మురుగునీటిని ఒక్కో ట్యాంకర్‌కు రూ.50-రూ.100 చెల్లించి సేకరించనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా 'ఎరుపు రంగు' ట్యాంకర్లను కేటాయించింది. సేకరించిన నీటిని నిర్మాణాలు, పరిశ్రమలు, పార్కుల నిర్వహణకు వాడడం ద్వారా తాగునీటిపై ఒత్తిడిని తగ్గించాలని జలమండలి అధికారులు భావిస్తున్నారు.సాధారణంగా ప్రజలు జలమండలి నుంచి నీటిని కొనుగోలు చేయడం మనకు తెలుసు. ఇప్పటికే హైదరాబాద్ నగరంలో వేసవి తాపం మె?దలవుగా.. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో నీటికి డిమాండ్ పెరిగింది. భారీగా ట్యాంకర్లు బుక్ చేస్తున్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. గేటెడ్ కమ్యూనిటీలలోని ప్రైవేట్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని జలమండలి తిరిగి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో ట్యాంకర్ నీటికి రూ.50 నుంచి రూ.100 వరకు చెల్లించేందుకు బోర్డు రెడీ అయింది.హైదరాబాద్‌లోని వివిధ గేటెడ్ కమ్యూనిటీలలో రోజుకు దాదాపు 200 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. ఇందులో తక్కువ నీటిని మాత్రమే గార్డెనింగ్, ఫ్లషింగ్ కోసం వాడుతుండగా.. మెజారిటీ నీరు నాలాల ద్వారా కుంటలు, చెరువుల్లోకి వృథాగా కలిసిపోతోంది. ఈ వృథాను అరికట్టి ఆ నీటిని పునర్వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. శుద్ధి చేసిన ఈ గ్రే వాటర్ సేకరణ కోసం జలమండలి ప్రత్యేకంగా రెడ్ కలర్ ట్యాంకర్లను ప్రవేశపెట్టనుంది. తాగే నీటి సరఫరా కోసం ప్రస్తుతం బ్లూ రంగు ట్యాంకర్లు వాడుతున్నారు. శుద్ధి చేసిన మురుగునీటి కోసం ఎరుపు రంగు ట్యాంకర్లను కేటాయించారు. గేటెడ్ కమ్యూనిటీలు తమ వద్ద ఉన్న నీటిని విక్రయించడానికి జలమండలిని సంప్రదిస్తే.. ఖాళీ ట్యాంకర్ నేరుగా వారి వద్దకు పంపి నీటిని సేకరించనున్నారు.సేకరించిన నీటి నాణ్యతను పరీక్షించిన తర్వాత.. దానిని తాగేందుకు కాకుండా ఇతర అవసరాలైన భవన నిర్మాణాలు, లాండ్‌స్కేపింగ్, గోల్ఫ్ కోర్స్ నిర్వహణ, పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తారు. ప్రస్తుతం నగరంలో శుద్ధి చేసిన నీటిలో 2 శాతం కంటే తక్కువే వాడుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కొత్త వాటర్ బ్యాంక్ ద్వారా దీనిని 2000 ఎంఎల్డీలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నా మని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాతిపదికన మూడు ట్యాంకర్లతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌ను బట్టి వీటి సంఖ్యను పెంచనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీకి చెందిన ఒక సంస్థ ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారు ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో నీటి డిమాండ్ పెరిగిందన్నారు. గతేడాదిమార్చిలో 2.1లక్షల ట్యాంకర్ల వినియోగం ఉంటే.. ఈ ఏడాదిఆ సంఖ్య 2.24 లక్షలకు చేరుకుందన్నారు. ప్రతి రోజూ సరాసరి 7500 ట్యాంకర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డొమెస్టిక్ ట్యాంకర్ రూ.500, కమర్షియల్ అయితే రూ.850 చొప్పున వసూలు చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

# మా సముద్రాన్ని కాపాడండి..

## రామాపురం తీరంలో మత్స్యకారులు, స్థానికుల నిరసన



బాపట్ల:బాపట్ల జిల్లాలో పర్యాటక రంగం ముసుగులో మత్స్యకారులను ఖాళీ చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, మా సముద్రాన్ని అధికారుల నుంచి రిసార్ట్స్ యజమానుల నుంచి కాపాడండి అంటూ రామాపురం మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలం రామాపురం పరిధిలోని సముద్రతీరంలో పర్యాటకులకు వినోదం పేరుతో బోటింగ్ ఏర్పాట్లకు గత నాలుగు రోజులుగా రంగం సిద్ధం చేస్తున్న సమయంలో స్థానిక మత్స్యకారుల ఆందోళన వివాదాస్పదంగా మారింది. ఈ ఆందోళనకు మత్స్యకార సంఘాల నాయకులు మద్దతు తెలుపడంతో సముద్రతీరంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒంగోలుకు చెందిన దేవనూరి రాజ్ కుమార్ దివే చీరాల ఎల్ ఎల్ పి పేరుతో బోట్ నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొంది, స్థానిక ప్రజా ప్రతినిధి, ఆర్.డి.ఓ సహకారంతో సముద్ర తీరంలో నో డెవలప్ మెంట్ జోన్ పరిధిలో సముద్ర అలల రేఖ (హై టైడ్ లైన్) నుండి 200 మీటర్ల పరిధిలోని ఇసుక దిబ్బలను చదును చేయడం ప్రారంభించారు. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలను ఉల్లంఘించి జరుగుతున్న ఈ వ్యవహారాన్ని స్థానిక మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సముద్ర తీరంలో భారీ యంత్రాలతో ఇప్పటికే ఇసుక దిబ్బలను పూర్తిగా తొలగించారు. ఈ విషయంపై స్థానిక మత్స్యకారులు అభ్యంతరాలు చెబుతున్నప్పటికీ వాస్తవాలను మరుగున పెట్టిన ప్రభుత్వ అధికారులు పర్యాటక రంగం పేరుతో జిల్లా కలెక్టర్ అనుమతి ఉందంటూ ఇసుక దిబ్బలను చదును చేశారు. ఈ నెల 19న బోటింగ్ ప్రారంభించేందుకు స్థానిక ప్రజా ప్రతినిధి ఏర్పాట్లు చేసుకున్నట్లుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సోషల్ మీడియాలో పలు కదనాలు వైరల్ కావడంతో శుక్రవారం ఫారెస్ట్ అధికారులు రావడంతో భారీ యంత్రాలతో సహా నిర్వాహకులు పారిపోయారనీ మత్స్యకారులు చెబుతున్నారు. చట్ట విరుద్ధంగా పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ వ్యవహారంలో అధికారులు మొండిగా వ్యవహరిస్తే రామాపురం మరో జువ్వలదిన్నె అవుతుందనడంలో సందేహం లేదు.

# తెరుచుకోనున్న ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్




కాకినాడ, : కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.. వాకలపూడి సెజ్‌లో ఉన్న రిఫైనరీ ప్లాంట్‌ను మూసివేస్తున్నట్లు కార్మికులకు సమాచారం ఇచ్చారు. అలాగే కలెక్టర్‌తో పాటుగా ఇతర శాఖల అధికారులకు మెయిల్ ద్వారా తెలిపారు. నష్టాలు రావడంతో కంపెనీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. యూనిట్ ప్రారంభించిన దగ్గర నుంచి వరుసగా ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయని చెబుతున్నారు. విదేశాల నుంచి ముడి చక్కెర ఈఐడీ ప్యారీ కంపెనీ అనుబంధ సంస్థ పీఎస్ఆర్ఐపీఎల్ (ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్) ప్లాంట్‌కు దిగుమతి అయ్యేది. ఈ ముడి చక్కెరను ప్లాంట్2లో శుద్ధి చేసి మళ్లీ ఎగుమతి చేసేవారు. ఈ ప్లాంట్ ప్రారంభించినప్పటి నుంచి ఇబ్బందుల్ని ఎదురవుతున్నాయి. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో రూ.1406 కోట్ల నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ బోర్డు సమావేశంలో ప్లాంట్ మూసివేయాలని డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, పరిశ్రమలు, ఇతర శాఖలకు సమాచారం ఇచ్చారు.. ప్లాంట్‌కు కాంట్రాక్ట్ కార్మికులు రావొద్దని చెప్పారు.వాకలపూడి సెజ్‌లో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన యూనిట్‌ను ప్రారంభించారు. ముందు ఈ ప్లాంట్‌ను గ్యాస్‌తో నడిపించాలని ప్లాన్ చేసినా.. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో బొగ్గుతో నడిపించాల్సి వచ్చింది.. ఈ మౌలిక సదుపాయాల కోసం అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. 2015-2016లో ఈ యూనిట్‌లో ప్రొడక్షన్ మొదలైంది.. ప్రారంభంలో రోజుకు రెండే వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంటే.. దానిని 3వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని భావించారు.కానీ మూడు వేల మెట్రిక్ టన్నులకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.. ఆర్థికంగా కూడా నిలదొక్కుకోలేకపోయారు. అలాగే పలు కారణాలతో 2021నుంచి 2022 వరకు రెండు నెలల పాటూ ప్లాంట్‌లు పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత 2022 నుంచి 2023లో వరుసగా ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్లాంట్‌ను నెల రోజులకు పైగా మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. షిప్పుల్లోకి లోడింగ్ కూడా ఆలస్యం కావడంతో భారీ జరిమానాలు చెల్లించడం ఇబ్బందిగ మారింది. వీటికి తోడు మార్కెట్‌లో చక్కెర ధరలు కూడా తగ్గడంతో మరిన్ని నష్టాలు వచ్చాయి. ఓవైపు రుణభారం కూడా పెరగడంతో యూనిట్‌ను నడపడం లాభదాయకం కాదని భావించారు. అందుకే ఈ యూనిట్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం మీద నష్టాల కారణంగా కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.

# సివిల్ ఇంజనీరింగ్ లో అహ్మద్ మిన్హాజుద్దీన్ కు పీహెచ్.డీ.



పటాన్ చెరు హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి అహ్మద్ మిన్హాజుద్దీన్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సిమెంటు, సూక్ష్మ కంకర కు పాక్షిక ప్రత్యామ్నాయాలు గా వ్యవసాయ-పారిశ్రామిక వ్యర్థాలను చేర్చిన సుస్థిర కాంక్రీటుపై ఒక అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరిజిత్ సాహా శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ అధ్యయనం, కాంక్రీటులో శుద్ధి చేయని చెరకు పిప్పి బూడిద (Ut-SCBA), వ్యర్థ గ్రానైట్ పొడి (WGP) వినియోగాన్ని అన్వేషించడం ద్వారా పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ యొక్క తీవ్రమైన సవాలును పరిష్కరిస్తుందని తెలిపారు. ఈ పరిశోధన ఎం 25 గ్రేడ్ కాంక్రీట్ లో సిమెంటు, ఫైన్ అగ్రిగేటుకు పాక్షిక ప్రత్యామ్నాయాలు గా వాటి ప్రభావాన్ని సమగ్ర యాంత్రిక, మన్నిక, సూక్ష్మ నిర్మాణ విశ్లేషణల ద్వారా మూల్యాంకనం చేస్తుందన్నారు. ఈ పరిశోధన ఫలితాలు 15 శాతం Ut-SCBA, 30 శాతాల ఉత్తమ మిశ్రమాన్ని గుర్తించాయని తెలిపారు. ఇది మెరుగైన బలం, మన్నిక, పర్యావరణ హితంగా ఉంటుందన్నారు. ఈ అధ్యయనం, డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించి, సహజ వనరులను పరిరక్షించే ఒక ఆచరణీయమైన, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాన్ని వెలుగు లోకి తెస్తోందని వివరించారు. డాక్టర్ అహ్మద్ మిన్హాజుద్దీన్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రమేష్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అఖిలేష్ చేకూరి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సినిమా


## సంపత్ నంది సినిమాను లైన్‌లో పెట్టిన శర్వా..





'నారీ నారీ నడుమ మురారీ, బైకర్' చిత్రాలతో దూసుకుపోతున్న చార్మింగ్ స్టార్ శర్వానంద్, 'భోగి' చిత్రంతో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం దర్శకుడు సంపత్ నందితో తొలిసారి శర్వానంద్ చేతులు కలిపారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇది శర్వానంద్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీగా అంచనాలను పెంచేసిన విషయం తెలిసిందే. 'బైకర్' మూవీ ప్రమోషన్స్ నిమిత్తం తీసుకున్న బ్రేక్ అనంతరం, శర్వానంద్ మళ్లీ ఈ సినిమా షూట్‌లో జాయిన్ అయినట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం రాజమండ్రిలో అత్యంత కీలకమైన, లెన్తీ షెడ్యూల్‌ను ప్రారంభించిందని, షూటింగ్ రంపచోడవరం అడవులలోని కఠినమైన, సవాలుతో కూడిన ప్రదేశాలలో జరగనుందని, ఇక్కడ ఎక్సయిటింగ్, టఫ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లుగా మేకర్స్ ఈ అప్డేట్‌లో తెలిపారు. ఈ సన్నివేశాలను యాక్షన్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో శర్వానంద్‌తో పాటు ప్రధాన తారాగణం మొత్తం పాల్గొంటున్నారని, ఇది సినిమా నిర్మాణానికి కీలక షెడ్యూల్ అని మేకర్స్ ప్రకటించారు. 'ఏ బ్లడ్ ఫెస్ట్' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో శర్వానంద్ ఒక సరికొత్త అవతార్‌లో కనిపించనున్నారు. ఆ విషయం ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్ తెలియజేసింది. 1960లో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వాస్తవికమైన కథనం, పవర్ ఫుల్ నేపథ్యంతో ఈ చిత్రం ఇంటెన్స్ డ్రామాతో గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని చిత్రబృందం చెబుతోంది. శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రక్షా బంధన్ స్పెషల్‌గా 28 ఆగస్ట్, 2026న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## మే చివరి వారంలో నిఖిల్ సిద్దార్థ 'స్వయంభు'...!




యువ హీరో నిఖిల్ సిద్ధార్థ కెరీర్‌లోనే అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న పీరియడ్ నేపథ్య చిత్రం 'స్వయంభు.' ఈ మూవీ రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ మూవీ మరోసారి వాయిదా పడనుందని తెలుస్తుంది. ప్రారంభంలో ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయాలని భావించినప్పటికీ, తరువాత వేసవి కాలానికి మార్చారు. ఇప్పుడు మరోసారి విడుదల తేదీ మారే పరిస్థితి ఏర్పడింది. చిత్ర బృందం ఏప్రిల్ 30న రిలీజ్ చేయాలని పరిశీలించినప్పటికీ, సాంకేతిక పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఆ తేదీ సాధ్యం కాలేదని సమాచారం. ముఖ్యంగా చిత్రంకి సంబంధిం చిన భారీ వీఎఫ్ఎక్స్ పనులకి మరింత సమయం పడుతుందని తెలుస్తుంది. పీరియాడిక్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతిదృశ్యం అత్యున్నత స్థాయిలోఉండేలా చిత్ర బృందంశ్రద్ధ తీసుకుం టోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రేక్షకులకు అద్భుత అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదలను వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన విజువల్స్ కథలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే అవి పూర్తి స్థాయిలో మెరుగ్గా రావాలని హీరో నిఖిల్ సిద్ధార్థతో పాటు చిత్ర యూనిట్ పట్టుదలగా ఉంది. తొందరపడి విడుదల చేయడం కంటే, పూర్తి స్థాయి పనులు ముగిసిన తర్వాతే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని మే నెల చివరి వారంలో విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విడుదల తేదీ ఖరారైన వెంటనే ప్రచార కార్యక్రమాలు కూడా భారీ స్థాయిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## నిర్మాతగా మారనున్న అజిత్ కుమార్?



స్టార్ హీరో అజిత్ కుమార్ నిర్మాతగా మారనున్నారంటూ కోలీవుడ్‌లో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఆయన హీరోగా నటించే 64వ చిత్రాన్ని సొంతంగా నిర్మించాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇంటర్నేషనల్ కార్ రేసింగ్ పోటీలపై ఆయన దృష్టి సారించారు. అలాగే గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ తర్వాత ఈ చిత్ర దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలోనే నటించేందుకు అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ ప్రాజెక్టు కోసం ఆయన నిర్మాతగా మారాలని భావిస్తున్నారు. అజిత్ కుమార్ స్పోర్ట్స్ సర్వీస్ ఎల్ఎల్పీ అనే పేరుతో నిర్మాణ సంస్థ పేరును దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలి (సౌత్ ఇండియన్ ఫిల్మ్ చాంబ ర్)లో రిజిస్టర్ చేయించారు. రూ.2.56 లక్షలు చెల్లించి లైఫ్‌టైమ్ మెంబర్షిప్ కూడా తీసుకు న్నారు. నిర్మాతగా మారేందుకు ఫిల్మ్ చాంబర్‌లో అజిత్ సభ్యత్వం తీసుకున్నారని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, నిర్మాతగా మారితే ఆయన హీరోగా నటిస్తారా లేదా అన్నది ఇపుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. తన సొంత నిర్మాణ సంస్థపై ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించే చిత్రాన్ని నిర్మించేలా చర్యలు తీసుకున్నట్టు సమాచారం. దీనిపై మరో 15 రోజుల్లో స్పష్టమైన క్లారిటీ రావొచ్చని ఫిల్మ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## విష్ణుప్రియకు కాసులు కురిపించిన వివాదం..

## ఫిర్యాదుతో అమాంతం పెరిగిన ఆదాయం!





డిజిటల్ మీడియా యుగంలో నెగెటివ్ పబ్లిసిటీ కూడా ఒక్కోసారి పాజిటివ్ ఫలితాలను ఇస్తుందనడానికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నారు బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని. అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆమెపై నమోదైన పోలీస్ కేసు, నైతికంగా ఆమెను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో చేసినప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఊహించని రీతిలో కలిసొచ్చింది. ఈ వివాదం కారణంగా ఆమె నెలవారీ ఆదాయం ఏకంగా రూ.11 లక్షలకు పైగా పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన వీడియోల కోసం నెలకు రూ.399 చొప్పున సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆమెపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందకముందు, ఆమెకు 1,892 మంది సబ్‌స్క్రైబర్లు ఉండేవారు. దీని ద్వారా ఆమెకు నెలకు సుమారు రూ.7.18 లక్షల ఆదాయం వచ్చేది. అయితే, ఎప్పుడైతే ఆమెపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నేతలు ఫిర్యాదు చేశారో, ఈ వార్త మీడియాలో ప్రముఖంగా ప్రసారమైంది. దీంతో ఆమె అప్‌లోడ్ చేసే కంటెంట్‌లో ఏముందో చూడాలనే ఆసక్తి నెటిజన్లలో ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా, కొద్ది రోజుల్లోనే ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,832కు చేరింది. తద్వారా ఆమె నెలవారీ ఆదాయం ఇప్పుడు రూ.18.36 లక్షలకు పైగా చేరింది. అంటే, కేవలం ఈ వివాదం వల్ల ఆమె సంపాదనలో రూ.11 లక్షలకు పైగా పెరుగుదల కనిపించింది. శనివారం విజయవాడ సూర్యారావుపేటలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ డబ్బుల కోసం యువతను తప్పుదోవ పట్టించేలా అర్ధనగ్న వీడియోలు పోస్ట్ చేస్తున్నారని, ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు.

సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన సెలబ్రిటీలు ఇలాంటి పనులు చేయడం సరికాదని వారు విమర్శించారు. అయితే, నైతిక విలువలను కాపాడాలనే ఉద్దేశంతో చేసిన ఈ ఫిర్యాదు, పరోక్షంగా విష్ణుప్రియకు ఉచిత ప్రచారంగా మారింది. ఒక విషయాన్ని ఎంతగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే, దానిపై జనంలో అంతగా ఆసక్తి పెరుగుతుందనే 'స్ట్రీసాండ్ ఎఫెక్ట్' ఇక్కడ స్పష్టంగా పనిచేసింది. మొత్తంగా ఈ సంఘటన, విమర్శలే పెట్టుబడిగా మారి నెగెటివ్ పబ్లిసిటీ కూడా సానుకూల ఫలితాలను ఇవ్వగలదని నిరూపించింది.

## కుమార్తెల పెళ్లిపై రాజశేఖర్ వ్యాఖ్యలు..

## సంబంధాలు వస్తున్నా, ఎందుకు ఆగామంటే..!



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ తాజాగా తన కుటుంబం, రాజకీయాలు, తాజా సినిమా గురించి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. హీరో శర్వానంద్ నటించిన బైకర్ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమార్తెలు శివాని రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ పెళ్లి గురించి మాట్లాడుతూ రాజశేఖర్ స్పష్టత ఇచ్చారు. మా అమ్మాయిలకు పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. కానీ వాళ్లు మాత్రం ఇంకొంత కాలం సినిమాల్లో నటించాలనుకుంటున్నారు. వారి అభిరుచికి మేము ప్రాధాన్యత ఇస్తున్నాం. అందుకే ప్రస్తుతం పెళ్లి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లడం లేదు అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కుమార్తెల నిర్ణయానికి తల్లిదండ్రుల మద్దతు ఉండటం పట్ల అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

రాజకీయాల గురించి మాట్లాడుతూ, తాము రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఎవరిపైనా ఆధారపడలేదని, సొంత డబ్బుతోనే ముందుకు వెళ్లామని చెప్పారు. అలాగే తన భార్య జీవిత రాజశేఖర్‌కి రాజకీయాలంటే ఆసక్తి లేదని వెల్లడించారు. ఇక తమిళ హీరో విజయ్ రాజకీయ ప్రవేశంపై స్పందిస్తూ, ఆయన రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలులో విజయ్ విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చాలా కాలం తర్వాత రాజశేఖర్, బైకర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యూవీ క్రియేషన్స్ నిర్మించింది. ఈ సినిమాలో రాజశేఖర్, శర్వానంద్‌కు తండ్రి పాత్రలో నటించగా, హీరోయిన్‌గా మాళవిక మోహనన్ కనిపించారు. భారతీయ సినీ చరిత్రలోనే తొలి పూర్తి స్థాయి 'మోటో క్రాస్ డ్రామా'గా రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, రాజశేఖర్ నటనకు ప్రత్యేక ప్రశంసలు దక్కుతున్నాయి.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNi No. TE TE . 12/48343